# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకటరత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి

మిస్.పి. ఇందిరాదేవి

డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు

డా॥ యమ్.స్వర్ణముఖి



Volume 30 Issue 9

No.of Pages 40

MAY 2011

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


## ఈ సంచికలో.... పేజీ


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| బాబూజీ ఉవాచ | 5 |
| మాతాజీ అభిభాషణ | 8 |
| సన్నిధిలో సంభాషణ | 10 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 13 |
| ప్రప్రధమ ఆళ్వారులు | 14 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 17 |
| శ్రీమాతాజీవారి ఉగాది సందేశం | 20 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 22 |
| సమర్థసద్గురు నాధుని దివ్యచరిత్ర | 24 |
| గిరిజా విజయం | 26 |
| మన సాధన ఎందుకు ఫలించటంలేదు? | 28 |
| పుట్టగానే పరిమళం వెదజల్లే పువ్వు | 31 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 33 |
| మహాత్ముల వాక్కు | 34 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 38 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

**గుహాస్త్య విద్యా మనసోతిరిక్తా**
**మనోహ్యా విద్యాభవబన్ధ హేతుః**
**తస్మిన్వినష్టే సకలం వినష్టం**
**విజృంభితే స్మినావకలం విజృంభతే**

(వివేకచూడామణి)

మనస్సుకి అవిద్య భిన్నముగా లేదు సుమా. మనస్సే అవిద్య. సంసార బంధనకు కర్తృత్వ భోక్తృత్వములకు మనస్సుని ఆవరించిన అవిద్యయే కారణమగుచున్నది. రజోగుణ తమోగుణ సంసర్గముచే మనస్సు మలినమయి బంధనముకు హేతువగుచున్నది. శుద్ధ సత్వ ప్రధానమగు మనస్సు మోక్షహేతువగుచున్నది.

సంసార బంధము మనస్సుచేతనే కల్పింబడినా మనస్సే సంసార బంధము నుండి విడిపించుటకు తోడ్పడుతోందనుట నిస్సందేహము.

మేఘము వాయువుచేతనే మరొక చోటుకు కొట్టుకు పోతోంది కదా! అలాగే విషయాసక్తమైన మనస్సు బంధహేతువై నిర్విషమైన మనస్సు బంధరహిత స్థితికి తోడ్పడి మోక్షహేతువు అవుతోందనటానికి సందేహము లేదు.

గాఢ సుషుప్తిలో మనస్సు కారణ రూపమును పొంది అణిగియుండుట చేత అక్కడ ద్వైతముగా కర్తృత్వ భోక్తృత్వ రూప బంధనకాని కానరాదు. అందువలన మనస్సే బంధనకి హేతువని పురుషునకు సంసార బంధన లేదన్న విషయము గ్రహించిన వారికి బంధన లేదు.

*

# అమ్మ ఆశీస్సులు

**మన్నాధ శ్రీజగన్నాధః, మద్గురో శ్రీజగద్గురుః।**
**మదాత్మా సర్వభూతాత్మా, తస్మై శ్రీగురవే నమః ॥**

శ్రీగురుదేవులే నా సర్వస్వము. నాలో నేనుగా ప్రకాశిస్తున్న స్వయంజ్యోతి స్వరూపుడు. నా నాధుడు శ్రీజగన్నాధుడు. నా గురుదేవులు శ్రీజగద్గురుదేవులు. నా ఆత్మ సర్వభూతములలోను వ్యాపించి ఉన్నవాడు. అట్టి శ్రీగురుదేవునకు నమస్కరిస్తున్నాను.

ఈశ్వరుడు, గురువు, ఆత్మ మూర్తి భేదములుగా బాహ్యదృష్టికి కనిపిస్తున్నారు, కాని **వ్యోమవత్** ఆకాశమువలె వ్యాపకముతో ఉన్నవారు. అట్టి ఆత్మ స్వరూపులే **"యుగే యుగే సంభవామి"** అని మాటిమాటికి ప్రతి యుగము నందు రూపనామ క్రియా రహితుడైన ఆత్మ శక్తి

**అప్రత్యక్షో మహాదేవః సర్వేషాం ఆత్మమాయయా ।**
**ప్రత్యక్షో గురురూపేణ వర్తతే భక్తిసిద్ధయే॥**

మన భక్తిని సిద్ధింప జేయుట కొరకు ప్రత్యక్షంగా గురు రూపమును మన కొరకై అనుగ్రహిస్తున్నారు. తానే సృష్టించిన పంచభూతాలను గ్రహించి రూపధారణను ప్రసాదిస్తున్నారు. **ఉపాసకానాం కార్యర్థం బ్రహ్మణో రూపకల్పనా।**

**అజోzపి సన్నzవ్యయాత్మా భూతానాం ఈశ్వరోzపిసన్**
**ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా॥**

ఈ విధంగా మన కొరకు మన ఈ చర్మచక్షువులకు యింద్రియము లకు గోచరించేటట్లు, ఆ యింద్రియములు కలిగినందుకు యీ జీవితమును పునీతము చేసేందుకు జ్ఞాన స్వరూపుడై వచ్చి మాయతో నున్న అజ్ఞాన భావమును హరింపచేస్తున్న మహాత్ములు వారు.

నిన్నగాక మొన్న ఉగాది పురుషుడుగాను, తరువాత శ్రీరామచంద్రుడు గాను అనుగ్రహసేవను భక్తులందరికి ప్రసాదించిన ప్రసాదదేవుడు. వైశాఖమాసము నందు పంచమి రోజున ఆదిశంకరాచార్యుని జయంతి మరియు శ్రీవారి మూర్తి ప్రతిష్ఠ వార్షిక మహోత్సవము మే 8వతేదీన జరుగనున్నది.

శ్రీగురుదేవులు ఎప్పుడూ ఉండే ఉన్నారు. ప్రకాశిస్తూనే ఉన్నారు. ఇన్ని జయంతులు ఉత్సవములు జరుగుతున్నవంటే వారు అవ్యక్తంగా అందిరిలోను ఉండి నిజమైన తృప్తి, నిత్య సత్యమైన ఆనందమును ప్రసాదిస్తూనే ఉన్నారు.

అందుకనే శక్తి మహాశక్తి. మహా అనే పదానికి గురు అని అర్థం. గురు అంటే మహా అని. అట్టి గురుశక్తిని తత్త్వస్వరూపుని తత్త్వదృష్టితోనే ఆశ్రయించాలి, చూడాలి, బోధామృతమును వినాలి. అర్థంచేసుకోవాలి. మననం చేయాలి. నిశ్చయం చేసుకోవాలి. విశ్వాసముంచాలి, నమ్మాలి. అనుసరించాలి. తరించాలి. అప్పుడే అట్టి జీవికి జీవన్ముక్త స్థితి కలుగుతునిది. అట్టి సర్వార్పణగా బుద్ధి దృఢ నిశ్చయమును, భక్తి శ్రద్ధలను శ్రీగురుదేవులు మనకు ప్రసాదించెదరు గాక!

శ్రీసద్గురు సేవలో

-మీ అమ్మ

## గోపికల భక్తి

ఒకసారి నారదునికి గోపికలపై జాలి కలిగి వారికి ఆత్మతత్త్వాన్ని ఉపదేశించాలనిపించింది. ఆవిషయం శ్రీకృష్ణస్వామితో చెప్పాడు. స్వామి "మంచిది వెళ్ళు" అన్నాడు. నారదుడు వాళ్ళందరినీ ఒకచోట చేర్చి "నేను తత్త్వ బోధ చేస్తాను వినండి" అన్నాడు.

"మహాత్మా! మీరు చెప్పే బోధలను ఆలకించే తీరిక మాకు లేదు. శ్రీకృష్ణ ప్రేమలో ఉన్మత్తులైన మా చిత్తాలకు ఇతర సుద్దులు వినటానికి క్షణం తీరిక లేదు క్షమించండి." అన్నారు గోపికలు.

**ఇనుమయస్కాంత సన్నిధి యెట్లు భ్రాంత**
**మగు హృషీకేశు సన్నిధి నా విధమున**
**కదలుచున్నది దైవయోగమున జేసి**
**బ్రాహ్మణోత్తమ! చిత్తంబు భ్రాంతమగుచు!**

అన్నట్లున్న వారి మాటలను విని నారదుడు విభ్రాంతుడైపోయి భక్తికి గోపికలను అవధిగా తీసుకుని 'యథావ్రజ గోపికానాం' అని తమ భక్తిసూత్రాలలో వ్రాసుకున్నాడు నారదుడు.

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

అట్టి భగవానుడే ఆ పుణ్య దంపతుల గర్భవాసాన జన్మించాడు. ప్రపంచంలో క్షణిక సుఖమైన యింద్రియ కర్మ ద్వారా కర్మ పుత్రులు పుడితేనే మానవులు ఎంతో సంబరపడిపోతారు గదా! కాని ఆ కర్మపుత్రులు తమ తల్లిదండ్రులకు పున్నామ నరకం కంటె ఘోరమైన అజ్ఞాన నరకం నుండి విముక్తి కలిగించలేరు. అటువంటి అజ్ఞాన నరకం నుండి విముక్తి కలిగించే దేవదేవుడే పుత్రుడుగా జన్మిస్తే ఆ తల్లిదండ్రుల ఆనందానికి, సౌభాగ్యానికి మేర ఉంటుందా? వారి సంకెళ్ళు పటాపంచలై పోయినవి. వారేకాదు; ప్రపంచంలోని సకల జీవరాసులు తమ బంధ విముక్తి కలిగించే భగవానుని ఆవిర్భావం జరిగిన ఆ క్షణంలో ఆనంద పరవశమై పోయినవి. ఒక పెద్ద దివ్య కాంతి దివి నుండి భువికి దిగి వచ్చినట్లు ప్రపంచ మంతటా అనిపించింది.



ప్రపంచంలో ప్రతి స్త్రీ, ప్రతి పురుషుడు కూడా అలా భగవానుని తమ పుత్రునిగా పొందగలగాలి. అందుకోసం వారు భక్తి అనే గర్భం ధరించాలి. అలా భక్తి గర్భం ధరించిన స్త్రీలు, పురుషులు కూడా ధ్యానమనే ఔషధం సేవిస్తూ, వైరాగ్యమనే పథ్యం జాగ్రత్తగా చేస్తూ తమ గర్భాన్ని కాపాడుకుంటే, వారికి జ్ఞానపుత్రుడు కలుగుతాడు. ఆ జ్ఞానపుత్రుడు వారి అజ్ఞాన తిమిరాన్ని హరించి, భవబంధములు తొలగించి, భగవానుని దర్శన భాగ్యం కలిగిస్తాడు. ఆ దర్శనం కలిగినపుడు తానెవరో తాను తెలుసుకునే ఆత్మజ్ఞానం కలుగుతుంది. జన్మ జన్మాంతర వాసనలన్నీ హరించి వాసుదేవ దర్శనమవుతుంది. కమనీయమైన ఆ దివ్య మంగళమూర్తి దర్శనమైన వెంటనే జీవభ్రాంతి, లోకభ్రాంతి, దేహభ్రాంతి, దారాపుత్ర భ్రాంతి అన్నీ తొలగిపోయి ఆత్మానందం నిలిచిపోతుంది.

గోపికలకు, రాధా మహాదేవికి, వాళ్ళ జన్మాంతర సుకృతం వలన అట్టి అదృష్టం లభించింది. జ్ఞాని సర్వత్ర ఆత్మవస్తువునే దర్శిస్తాడు. అలాగే తనలోనూ దర్శిస్తాడు. ఇంద్రియ వాసనల వల్ల అజ్ఞానం పొగవలె ఆవరించి

ఆత్మకాంతిని మరుగు చేస్తుంది. అందువలన, దేహభ్రాంతి, జీవభ్రాంతి, లోకభ్రాంతి కలుగుతాయి. ధనదారిద్ర్యం కంటె ఘోరమైన అజ్ఞాన దరిద్రం చుట్టుకుని దుఃఖం మిగులుస్తుంది. అటువంటి అజ్ఞాన ఆవరణ దోషాన్ని హరించగల శక్తి భగవానునికి మాత్రమే ఉంది.

ఈ విషయం భగవానుడైన గీతాచార్యుడే స్వయంగా తన గీతాసందేశంలో అర్జునుని నెపంతో మానవులందరికి వివరించాడు. "అర్జునా! నా మాయ అనేదే ఈ అజ్ఞాన ఆవరణ. దానిని నీ శక్తితో ఎన్నటికి దాటలేవు. అందుకు నన్ను ఆశ్రయించు. నా నామాన్నే సదా స్మరించు. నా రూపమే సదా మనస్సున నిలుపుకో. నా యందు గాఢము, అనన్యము అయిన ప్రేమను పెంపొందించుకో. అప్పుడు ఆ అజ్ఞాన ఆవరణ అనే నా మాయ తొలగిపోతుంది. అందరిలోనూ అప్పుడు నీవు నన్నే చూడగలుగుతావు. అందరిని నీవలెనే ప్రేమించగలుగుతావు. అందరి ప్రేమను అందుకో గలుగుతావు. ఇది తెలుసుకోలేక మాయ అనే అజ్ఞానానికి లోబడిన మానవులు అన్ని వస్తువులనూ ప్రేమిస్తున్నారు గాని, వాటిని ప్రకాశింపచేసే అసలు వస్తువైన నన్ను గుర్తించలేకపోతున్నారు, ప్రేమించలేక పోతున్నారు. మమకారంలో పడి తమ్ము తాము బంధించుకుంటున్నారు. ధనంతో అన్నీ సాధించగలమనే భ్రాంతిలో పడి ధనార్జనకే తమ కాలాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. నన్ను మరచి పోయి నరక బాధలకు గురి అవుతున్నారు. అలా కాదు; నన్ను స్మరించండి, ధ్యానించండి. ఈ ప్రపంచంలో ఉండే సర్వ వస్తువులలోను శ్రేష్టమైనవన్నీ నేనే." అని గీతాచార్య ఉవాచ.

ఎన్నో నీచయోనులలో జన్మలెత్తి, ఆర్జించిన పుణ్యం వలన ఉత్తమమైన మానవ శరీరం కలుగుతుంది. దాని ద్వారానే జన్మరాహిత్యం పొందే అవకాశం ఉంది. అలా జన్మరాహిత్యతను సాధించి మానవజన్మను ఆఖరి జన్మగా సార్థక పరుచుకోవాలంటే ఈ శరీరమును, బాహ్యేంద్రియాలను, అంతరింద్రియాలను అన్నిటిని ఆ భగవానుని సేవకే వినియోగించి, ఆ ప్రభువు దివ్య దర్శనం కోసం ఆరాటపడాలి. కన్నులు కలిగినందుకు ఆ దివ్య మంగళ విగ్రహమును దర్శించగలగాలి. బాహువులు కలిగినందుకు భవబంధములను హరించే ఆ దివ్య పాద పద్మములను స్పృశించగలగాలి. ఆ దివ్యమంగళ విగ్రహమును ఆలింగనము చేసుకున్న శరీరమే శరీరము. అలా చేయలేని ఈ శరీరము, ఈ యింద్రియములు

వ్యర్థములు. ఆయన రంగడు, లింగడు కూడాను. అయినా రెండూకానివాడు. లింగ భేదము లేని అభేద స్వరూపుడు. నిత్యుడు, శాశ్వతుడు, భావరహితుడు. ఆయనను ఆలింగనం చేసుకోవటం అంటే మనస్సు, శరీరము, సర్వత్ర, సర్వ యింద్రియాలలోను కణ కణములోను నిండి ఉన్న ఆయన ఉనికిని గుర్తించటమే. అదే నిజమైన ఆలింగనము. రెఫ్రిజరేటర్‌లో ఏదైనా ఆకారం ఉన్న చట్రంలో నీరు పోసి ఉంచితే, ఆ నీరు అదే ఆకారంలో ఘనీభవించి రూపం ధరించి మనకు దర్శనమిస్తుంది. అలాగే భగవానుని మనస్సు నందు నిలిపి ధ్యానించినట్లైతే, శంఖ, చక్ర, గదా, పద్మాలతో, తులసీమాలలతో, సంపెంగ హారాలతో, ఆ మనోహరాకృతి మన మనస్సునందు నిలిచిపోతుంది. జాగ్రత, స్వప్నము, సుషుప్తి ఈ మూడు అవస్థలలోను, ఈ మూడవస్థలకు అతీతమైన ఆత్మవస్తువును అలా తనలో తాను సర్వదా దర్శించగలుగుతాడు భక్తుడు.

భక్తుడు మొదట తాను వేరు, భగవానుడు వేరు అనుకుంటాడు. కాని తీవ్ర ఏకాగ్రతతో సాధన చేసిన కొలది, ఆ భగవానుని బాహ్యంగాను, తన హృదయంలోను దర్శించటమే గాక, తన రూపంలోనే ఆయనను దర్శించి, తానూ ఆ భగవానుడు అభిన్న స్వరూపులమనే అనుభవం కలుగుతుంది. చివరికి ఆ అనుభూతి, దానిని పొందుతున్న తాను అనే ద్వైతం కూడా తొలగి, తానే పరమాత్మ వస్తువుగా అభిన్న స్వరూపుడైపోతాడు. ఈ అనుభూతి పొందటానికి ఏకాగ్రమైన సాధన ఒక్కటే మార్గము.

రేడియోలో మనకు కావలసిన స్టేషను రావాలంటే, ఒక పాయింటు మీద ముల్లును నిలపాలి. అది కరెక్టుగా ఆ పాయింటు మీద నిలిచినపుడు ఆ స్టేషను వస్తుంది. ఆ పాట వినబడుతుంది. ఆనందం కలుగుతుంది. అలాగే లక్ష్మీ నారాయణుని దర్శించాలంటే, ఆయన పాదారవిందముల యందు మనస్సు నిలపాలి. అప్పుడు నాదబిందు కళాతీతుడైన స్వామిని దర్శించగలము. ఆ నాదం కూడా నిలిచిపోయి, ఆ రూపం గూడా అదృశ్యమైపోయి, తత్ స్వరూపాన్ని పొందగలము.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

చూడండి, ఇక్కడ ఒక విషయం గుర్తుపెట్టుకోండి. అర్జునుడికి కృష్ణ భగవానుడు భగవద్గీతను ఉపదేశించాడు. కృష్ణుడు చెప్తున్నాడు; అర్జునుడు వింటున్నాడు. మొదటి అధ్యాయమంతా అర్జునుడు ఏడ్చాడు. తెలియనటువంటి స్థితిలో భోరున ఏడ్చి ఏడ్చి, తన గమ్యస్థానం ఏమిటని, ప్రభువుని ప్రార్థించాడు. ఏదో కొంతసేపు ఏడ్చేసి వదిలి పెట్టేయలేదు అర్జునుడు. ఇప్పుడు కొంతమంది ఏం చేస్తున్నారంటే, ఏడ్చి ఏడ్చి, ఎవరో చెప్పగా విని, మహాత్ములని ఆశ్రయించినట్టుగా ఆశ్రయించి, కొంచెం సులువు దొరికేసరికి, కుక్కతోకలాగ,'నేను, నా ప్రజ్ఞ' అని విర్రవీగుతున్నారు.



అమ్మ బాబోయ్! మాయ యొక్క ప్రభావం ఎంత గొప్పదండీ! దానిని దాటటం మనతరమా? అని చెప్తూ శ్రీ మాతాజీ ఈ కీర్తననాలాపించారు.

"ఎంతో గొప్పది నీమాయ!
అది రానీయకు నా ఛాయ
అది (దానిని) దాటాలంటే నీదయ
మరివేరే మార్గం లేనే లేదయా!

1) దారాపుత్రులు, బంధు మిత్రులు
దాని బలగమే లేవయ్యా
ధన ధాన్యాలు, ఘన బిరుదాలు
దాని గారడీ లేవయ్యా॥ ఎంతో॥

2) తెలియక పోవటమొక మాయ
తెలుసనుకోడం పెనుమాయ
తెలిసీ తెలియని అయోమయంలో
తికమక పడటం మహామాయ॥

3) ఇన్ని తికమకలు లేవయ్యా,
ఉన్నది నీ వొకటే నయ్యా
నువ్వుంటేనే నీననయ్యా
నేనంటే నువ్వేనయ్యా

॥ఎంతో గొప్పది నీమాయ॥

ఇదేమిటి ఈ మాతాజీ ఎప్పుడూ దారాపుత్రాదులనే అంటారని అనుకుంటున్నారా? పురుషోత్తముడొక్కడే 'పురుషుడు'. ప్రకృతికి దాస్యం చేసేవారందరూ స్త్రీలే. అందుకే త్యాగరాజస్వామి, "ఎంతనేర్చినా, ఎంతజూచినా, ఎంతవారలైనా కాంత దాసులే" అన్నారు. కనుక అటువంటి మాయని దాటాలీ అంటే ఆ మాయని దాటిన వారిని ఆశ్రయించాలి. ఆ మాయ భగవంతుడిదే కనుక ఆయననేనా ఆశ్రయించాలి, లేక దానిని దాటిన మహాత్ములను సత్యగురువులను ఆశ్రయించాలి. ఏదయినా ఒక్క పాదాన్నే ఆశ్రయించాలి. ఒక్క గురుపాదమే అయితే చాలా సుఖం.

గురుదేవుడే భగవానుడు. భగవత్ స్వరూపమే ఒక గురురూపంలో అవతరిస్తోంది. అక్కడవున్న తత్వం తెలుసుకుంటే, సకల దేవతలు ఒక్క గురుపాదం లోనే వున్నారు. అందుకనే గురుపాద తీర్థాన్ని సేవిస్తే, సకల తీర్థాలూ తీసుకున్న ఫలితం లభిస్తోందండీ! సమర్ధ రామదాసస్వామివారి శిష్యుడైన అజ్ఞాన్ కథ మనకదే చెపుతోంది.

సమర్ధ రామదాసస్వామివారు ఒకసారి కాశీకి వెళ్ళడానికి నిర్ణయించుకొని, శిష్యులనుద్దేశించి, "మీలో ఎవరయినా ఒకరు ఇక్కడే మఠంలో వుండి, దేవతార్చనని జాగ్రత్తగా చూసుకుంటే, మేము కాశీకి వెళ్ళి వద్దామనుకుంటున్నాము" అంటారు. గురువుగారితో తామే కాశీ వెళ్ళాలని శిష్యులందరూ ఉవ్విళ్ళూరుతూ, అమాయకుడైన అజ్ఞాన్ అనే శిష్యుడి వద్దకు వెళ్ళి, "మేమంతా గురువుగారితో కాశీకి వెళ్తున్నాము. నిన్ను ఇక్కడేవుండి, దేవతార్చన పూజా అదీ చూసుకోమన్నారు" అని అంటారు. వెంటనే అజ్ఞాన్ ఏమాత్రం సందేహించకుండా, "గురుదేవుల ఆజ్ఞ ప్రకారమే నడుచుకుంటాను" అంటాడు.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

26-5-1985

ఈ రోజు శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఈ పండితులు అంతా కలసి పరమాత్ముణ్ణి పంచకోశాల మధ్య నిలబెట్టారు. అలా అంటే మీరంతా నమ్ముతారా? పంచకోశాల మధ్య పరమాత్ముడంటే పంచకోశాలను ప్రకాశింపజేసేది ఏది? పరమాత్ముడు సగుణంగా రాముడిగా కృష్ణుడిగా అవతరించాడు. నిర్గుణంగా చూస్తే ఆత్మ స్వరూపుడిగా ప్రకాశిస్తున్నాడు. తల్లిదండ్రులు పవిత్రమైన మానవజన్మను ఇవ్వగలరు. కాని తరించే శక్తిని ఇవ్వలేరు. కాని ఈ మానవ జన్మ లభించినందువలనే భగవంతుని గురించి ఆలోచించ గలుగుతున్నావు. తల్లిదండ్రుల కామవాంఛ ప్రతిఫలమే మానవ జన్మ. అది ఒక ఋణానుబంధం. జన్మ సుకృతం మంచిదైతే పుట్టగానే ప్రవర్తన చక్కగా ఉంటుంది.

కొంతమంది మాతృగర్భంలోనే మహాభక్తులు. అటువంటివాడే ప్రహ్లాదుడు. 5 సంవత్సరాల ప్రాయంలో చైతన్యుడు, 2సంవత్సరాల ప్రాయంలో శంకరుడు తల్లిదండ్రులకు జ్ఞానబోధ చేసినట్లు మనకి ఆధారాలు ఉన్నాయి. సంస్కారం మంచిది కాకపోయినా లింగోద్భవ కాలంలో నిదుర లేచి నీ మనస్సుని ఆ ప్రభువు యొక్క దివ్య చరణారవిందాలపై నిలిపి భగవద్ధ్యానం చేస్తే, జన్మ జన్మల నుంచి ఆర్జించిన కర్మ రహితమవుతుంది.

నీ ఇంట్లో తిరిగే ఎలుకలనే నువ్వు పట్టుకోలేవు కదా! ఇంక నీ మనస్సుని ఏం పట్టుకోగలుగుతావు? నీకు భగవంతుని యందు విశ్వాసం లేకపోతే ఇక లక్ష్యార్థాన్ని ఏం సాధిస్తావు? అటువంటి వ్యక్తికి క్షణక్షణానికి సందేహాలే. ఒక వ్యక్తి బాణాన్ని సంధించాడు అనుకుందాం. ఏకాగ్ర దృష్టి లేకుండా బాణాన్ని వదిలితే ఏమవుతుంది? ప్రక్కనున్న వారికి మోక్షం ప్రాప్తిస్తుంది.

మీకు ఒక ఉదంతం చెబుతాను. ఒక వ్యక్తి తత్త్వ శాస్త్రం మీద రీసర్చి చేశాడు. పి.హెచ్.డి పట్టా పుచ్చుకున్నాడు. తాను రీసర్చ్ చేసి వ్రాసిన గ్రంథంలో ఎన్నో వ్రాశాడు. కాని అందులో ఒక్క దాన్ని కూడా ఆచరణలో పెట్టలేదు.

ప్రయోజనం ఏముంది? గురుబోధామృతాన్ని విన్నాడు. విన్నంత మాత్రాన ప్రయోజనం ఏముంది? అనప చేలో ఆవు గబగబా తినేసి వచ్చి ఒక చెట్టు క్రింద విశ్రమించి నెమరు వేస్తుంది. అలాగే శ్రవణం చేసిన గురుబోధని మననం చేసి దానిని ఒక్కసారి స్మరించి వదిలివేయటం కాదు చేయవలసినది అన్నారు శ్రీబాబు.

ఇంకా మాట్లాడుతూ భక్తుడు ఎలా ఉంటాడో ఒక ఉపమానం చెబుతాను. శ్రీరామచంద్రుడు లక్ష్మణుడిని పిలచి లక్ష్మణా! జితేంద్రియుడు విశ్రమించి నిదురలో ఉన్నాడు. ఒక పర్యాయం చూసిరా తన కర్తవ్య నిర్వహణ మరచినట్లున్నాడు అని పంపిస్తాడు. లక్ష్మణుడు జితేంద్రియుని దగ్గరకు వెళ్ళి చూశాడు. ఆయన గోవిందాసనం వేసికొని ఓం అని గాలిపీల్చి రాం అని గాలి వదులుతున్నాడు. శరీరంలోని రోమాలు రామ అని తారకనామాన్ని జపిస్తున్నాయి. ఆయన ఒక్కసారి రాం అనేటప్పటికి 33కోట్ల రామనామ జపం జరిగిపోతోంది. ఇక దుష్ట శక్తులు ఎక్కడా నిలబడటానికి స్థలం లేదు. నదిలోకి వర్షపు నీరు వచ్చిందనుకోండి, పాతనీరు నిలబడటానికి స్థలం ఉండదు. అది సాగరాన్ని చేరుతుంది. సాధు దర్శనం ద్వారా అనంతమైన జ్ఞానశక్తి కలిగి నీలోని రాక్షస శక్తి హరింపబడుతుంది. రామ రసాయనం అంత శక్తినంతమైనది అన్నారు శ్రీబాబు.

తారకనామం యొక్క శక్తి రామునికి తెలుసు, శబరికి తెలుసు. కాని శ్రీరామ చంద్రునికి మాత్రం భక్తుల ఎంగిలి ఎలా ఉంటుందో తెలుసు. అది మనబోటి కోన్‌కాస్ గొట్టంగాళ్ళకి ఏం తెలుస్తుంది తారకం? అన్నారు. మన కంటికి రంగు అద్దాలు ధరిస్తే వస్తువులో దోషం ఉంది అన్న భావం కలుగుతుంది. వస్తువుకి మనకి మధ్య ఉన్న అద్దమే ఆ భావానికి కారణం. అలాగే దోషం తనలో పెట్టుకుని పరమాత్ముడికి కోపం వచ్చింది అంటాడు. ఏమంటారు రావుగారూ! మీరు అంటూ ఉంటారు కదా 'బాబుగారు ఈరోజు కోపంగా ఉన్నారని' అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ శ్రీకృష్ణపరమాత్మ మాయావి, ఇంద్రియ లోలుడు అని దుర్యోధన వర్గానికి చెందినవారు అభాండాలు వేస్తే మాత్రం భీష్ముడు, విదురుడు నమ్మారాండీ! అటువంటి భావాలు కలగటానికి కారణం మనస్సు. అటువంటి మనస్సును మార్చగలది ఒక్క గురుపాద ధ్యానము మాత్రమే. గుణహీనుడు అయితే మనస్సుకి దాసుడు అవుతాడు కాని, భక్తుడు

ఎన్నడూ మనస్సుకి దాసుడు కాడు. మరి త్యాగరాజు తన మనస్సుని అదే ప్రశ్నించాడు. 'మనస్సా! నిధి చాలా సుఖమా? రాముని సన్నిధి సుఖమా?' అని. నిజం చెప్పు అని నిలదీసి అడిగాడు. 'తారక నామం తప్ప ఇంక ఏదీ నాకు సుఖాన్ని ఇవ్వదు' అని మనస్సు సమాధానం చెప్పింది.

**27-5-1985**

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ అంత్యకాలంలో మానవుడు ఎంత పండితుడైనా, శాస్త్రకారుడైనా వ్యాకరణాన్ని వల్లిస్తే ముక్తిని పొందగలుగుతాడా తారకం? అని ప్రశ్నించారు. తారకంగారు మాట్లాడుతూ పొందలేడు బాబు అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ మరి ముక్తిని పొందాలంటే ఏం చేయాలి? గోవిందుడిని భజించాలి. అదే శంకరభగవత్పాదులవారు చెప్పారు. ఇంకా మాట్లాడుతూ గృహస్థాశ్రమంలో మానవులు మూడు రకాలుగా ఉంటారు. వారే జ్ఞానులు, భక్తులు, మూర్ఖులు లేక అవివేకులు. జ్ఞానులు ఉప్పు బొమ్మలాంటివారు. భక్తులు గడ్డి బొమ్మలాంటివారు. అవివేకులు లేదా మూర్ఖులను రాతి బొమ్మతో పోల్చవచ్చు.

ఉప్పుబొమ్మ సాగరంలో మునిగిన వెంటనే తన రూపాన్ని కోల్పోయి సాగరంలో లీనమవుతుంది. జ్ఞానులు అనుక్షణం ఆత్మానంద సాగరంలో మునిగిపోయి ఉంటారు. గడ్డిబొమ్మని సాగరంలో ముంచితే నీటిని పీలుస్తుంది కాని తన రూపాన్ని కోల్పోదు. భక్తులు గురుబోధామృతాన్ని స్వీకరించి ఆనందాన్ని పొందుతారు. రాతి బొమ్మని సాగరంలో ముంచితే అది మునిగిపోతుంది కాని రవ్వంతైనా నీటిని పీల్చదు. మూర్ఖులు, అవివేకులు ఎంతకాలం గురుబోధని వింటే మాత్రం ఏం లాభం? వారి మనస్సు ప్రాపంచిక విషయాదులలో ఊరి ఉంటుంది. అటువంటి అవివేకులకు దూరంగా ఉండాలి.

హీనుడు ఆ గుణంబు మానునా! బొగ్గు పాల గడుగు పోవునా మలినంబు!' మీకు కోతి కథ తెలుసు కదా! మిణుగురు పురుగులతో మంట చేయలేవు కోతి బావా అని సలహా ఇచ్చినందుకు కోతి చేతిలో రాయి దెబ్బ తిని చనిపోయింది చిలక. అలా ఉంటాయి మూర్ఖుల మనస్సులు. సప్త సముద్రాలలోనూ నదుల్లోను స్నానం చేసినంత మాత్రాన తరించ గల్గుతారా? గురుపాద తీర్థంలో ఓలలాడిన వాడికి కలుగుతుంది జ్ఞానవిజ్ఞానయోగా అనుభవము.

-సశేషం

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

మే 2011

1 ఆది మాసశివరాత్రి.

8 ఆది శంకరజయంతి, శ్రీ సద్గురు షోడశ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము,శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన

17 మంగళ వైశాఖ పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

22 ఆది శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సహిత శ్రీరామలింగేశ్వర స్వామి త్రింశత్ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము, రాత్రి 7 గం.లకు శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి వారి లీలా కళ్యాణ మహోత్సవము.

27 శుక్ర శ్రీగురుదశమి, హనుమజ్జయంతి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

31 మంగళ మాస శివరాత్రి.

జూన్ 2011

10 శుక్ర శ్రీ సుగుణప్రసాద మాతాజీవారి చతుర్దవార్షిక పుణ్యారాధన ,శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం.

15 బుధ పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ.

25 శని శ్రీ గురుదశమి, హనుమజ్జయంతి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

29 బుధ మాస శివరాత్రి.

# ప్రప్రథమ ఆళ్వారులు

ఆంగ్లమూలం- ఆర్. సంపత్, తెలుగు అనువాదం - సుషుమ్నా ప్రసాద

శ్రీమన్నారాయణుడు సృష్టికర్త బ్రహ్మదేవునకు పృథ్విపై సకల చరాచర జగత్తును సృష్టించే కార్యక్రమమును అప్పగించాడు. ఈ చరాచర జగత్తునందు మానవుడు జీవరాసులలో ఉత్తమోత్తమమైన రాశిగా సృష్టించి, శ్రీమన్నారాయణుడు మానవుడు తన జన్మకు మూలకారణమైన భగవానుని యందు మనస్సు లగ్నం చేసి, తరిస్తాడని ఎంతగానో ఆశించాడు. కాని ఆశించిన దానికన్న విరుద్ధమైన ఫలితమును రాగా, మానవాళిని తరింపజేయటానికి దోహదంచేయటానికి చతుర్వేదములను, ఉపనిషత్తులను, ఇతిహాసములు, పురాణములు గ్రంథరాజములను సృష్టించి, తద్వారా మానవుడు ఉత్తేజితుడై లక్ష్మీనారాయణుని చేరుకుంటాడని ఆశించాడు. కాని వాటి ప్రభావము వలన కూడ మార్పు రానందున తానే భువిపై రామకృష్ణులుగ అవతరించి, ధర్మపథమున సంచరించి తరింపజేయ నిశ్చయించాడు.

ఈ మత గ్రంథములు, వేదవేదాంగములు, ఉపనిషత్తుల వలన మానవునిలో జ్ఞానతృష్ణను పెంచి, భక్తిద్వారా భగవంతునిలో లయమయ్యే మార్గానికి అవరోధం కలుగుతుందని గ్రహించి, మానవోద్ధరణకు తన విశిష్టమైన అంశలను, భక్తిసందేశాలను అందజేసి, తరింపజేయటానికి ఆళ్వారుల రూపంలో భూమిపై ఉద్భవించేటట్లు చేశాడు. వారికి భక్తి ప్రబోధం ద్వారా మానవులు భౌతికమైన కోరికలు, తద్వారా వచ్చే బంధము నుండి విముక్తి చెందటానికి మహత్తరమైన అవకాశాన్ని కల్పించారు. ప్రసిద్ధమైన ద్వాదశ ఆళ్వారుల జనన క్రమమమిట్టిది. తమిళ భాషలో ఆళ్వారులంటే శ్రీమన్నారాయణుని మహత్తర లక్షణములలో నిమగ్నమైనవారని అర్థం.

ఈ ద్వాదశ ఆళ్వారులలో ప్రప్రథమంగా ముగ్గురున్నారు. 1. పొయ్‌గై ఆళ్వారు, 2. భూతత్తాళ్వారు, 3. పేయాళ్వారు. వారు ఆత్మసాక్షాత్కారము ద్వారా పొందిన దివ్యానందమును మానవాళితో పంచుకోవటానికి సంసిద్ధులైనారు. దైవ నిర్ణయం ప్రకారం ఆ యోగులు మువ్వురూ అయోనిజులుగా ఉద్భవించారు. వారు స్వయంభువులు. ఒకే సంవత్సరం, ఒకే ప్రాంతంలో, ఒకే మాసంలో (ఆశ్వయుజ) ఉద్భవించారు. ఆ ప్రాంతమును తొండైనాడు అంటారు. (అంటే ప్రస్తుతము చెంగల్పట్టు జిల్లా). వారు

అయోనిజులు కాబట్టి సత్వగుణ సంపన్నులై, రజో, తమో గుణములకు దూరంగా ఉండేవారు. భక్తి, జ్ఞాన, వైరాగ్యములతో విలసిల్లుతూ భగవానుని మహిమను, వైభవోపేతమైన లక్షణములను ప్రచారం చేయటము వారి జీవిత లక్ష్యంగా పెట్టుకొన్నారు. కాంచీపుర సమీపంలో తిరువేంకటమనే తటాకమందు పద్మదళముల మధ్య శిశువుగా పొయ్‌గై ఆళ్వారు ప్రత్యక్షమైనారు. ఆ శిశువునకు ఆ పల్లె ప్రజలు పొయ్‌గై అని నామకారణం చేశారు. పొయ్‌గై అంటే తటాకము అని అర్థం. ఆయన జన్మతార శ్రవణము. వైష్ణవులా మహాభక్తుని శ్రీమన్నారాయణుని పాంచజన్య అంశగా సేవించేవారు.

భూతత్తాళ్వార్ అనే రెండవ ఆళ్వారు చెన్నై సమీపాన మహాబలిపురం సముద్రతీరంలో శిశువుగా సాక్షాత్కరించాడు. ఆయన శ్రీమన్నారాయణుని కౌముదిక అంశగా ప్రజలు సేవించారు. ఆయనది ధనిష్ఠ నక్షత్రము. ఆ మహానుభావుడు పంచభూతములలో శ్రీమన్నారాయణుని దర్శించి, ప్రజలందరిని అలాంటి దివ్యానుభూతిని పొంది, తరించమని ఆదేశించాడు కాబట్టి ఆయనను భూతత్తాళ్వారుగా పేర్కొన్నారు.

మూడవ ప్రవక్త పేయాళ్వారు చెన్నై నగరము మైలాపూరులో ఉన్న ఆదికేశవ స్వామి ఆలయమందున్న నూతిలో శిశువుగా శతభిష నక్షత్రమందు ఉద్భవించారు. పేయాళ్వారును శ్రీమన్నారాయణుని యొక్క నంద (కత్తి) అంశగా పరిగణిస్తారు. పే అంటే తమిళములో దయ్యము అని అర్థం. ఆయన ప్రజలు పేయాళ్వారు అని ఎందుకు నామకరణం చేసారంటే ఆయన ధ్యేయం సర్వేసర్వత్ర స్వామిని దర్శించి, దివ్యానుభూతిని పొందటం. ఎలాగైతే దయ్యము తన కోరికలు తీర్చుకోవటానికి పరుగులు పెడుతుందో, అలాగే పేయాళ్వారు ప్రభువును సర్వేసర్వత్ర దర్శించటానికి నిర్విరామ కృషి చేసేవారు.

ఈ ముగ్గురు ఆళ్వారులు సమకాలికులైనా ఎవరి ధ్యేయం నెరవేర్చుకోవటంలో వారు నిమగ్నమై ఉన్నందున చాలా కాలం ఒకరినొకరు కలుసుకోలేదు. ఒకమారు యాదృచ్ఛికంగా దక్షిణాన పెన్నానదీ తీరమందున్న తిరుక్కోవలూరు గ్రామంలో ఉన్న దేవాలయమందు కలుసుకొన్నారు. ఆకాశమంతా మేఘావృతమై, గాఢాంధకారముగా ఉన్నది. పొయ్‌గై ఆళ్వారు అక్కడ ఒక చిన్న కుటీరమును చూచి, అందులోనికి వెళ్ళి, నేలపై విశ్రమించాడు. ఇంతలో భూతాత ఆళ్వారు వర్షంలో గూడుకై వెదుకుతూ ఆ కుటీరం తలుపు తట్టాడు. వెంటనే లోపల ఉన్న పొయ్‌గై ఆళ్వారు 'అయ్యా! ఈ కుటీరం

చాలా చిన్నది. ఒక్కరు మాత్రమే నిద్రించటానికి జాగా ఉన్నది. ఇద్దరైతే నేలపై కూర్చోవచ్చు. మీకు స్వాగతం' అన్నాడు. భూతత్తాళ్వారు తలుపు తోసుకుని లోపలకు వచ్చి, ఇద్దరూ కూర్చున్నారు. ఇంతలో పేయాళ్వారు వచ్చి తలుపు తట్టారు. వెంటనే లోపలున్న ఇద్దరూ ఏక కంఠంతో 'ఈ చిన్ని జాగాలో ఒకరైతే నిద్రించవచ్చు, ఇద్దరైతే కూర్చోవచ్చు, ముగ్గురైతే నిలబడాలి. మీకిప్పుడు గూడు అవసరం కాబట్టి లోపలికి రండి' అన్నారు.ఆ ముగ్గురూ అలా ఒదిగి, ఒదిగి శ్రీమన్నారాయణుని వాత్సల్యమును జుర్రుకొంటుంటే అదృశ్యమైన నాల్గవ వ్యక్తి లోపలకు దూరాడు. ఆ ఆగంతుకుడు ఎవరై ఉంటారాయని ఆలోచిస్తూ ఆ ముగ్గురూ దీపం వెలిగించి, చూద్దామనుకొన్నారు కాని ఆ నిర్జన ప్రదేశంలో వారికి దీపం ఎక్కడ దొరుకుతుంది?

ఇంతలో పొయిగై ఆళ్వారుకు ఒక అద్భుతమైన ఊహవచ్చింది. ఆయన ఊహలో ఒక ఒక లాంతరును సృష్టించి, దానికి భూమిని మూలంగా, సాగరాన్ని నేతిగా సూర్యభగవానుని ఒత్తిగా చేసి, ఒక అద్భుతమైన అంత్యాక్షరీ పద్యశతకాన్ని రచించారు. అంత్యాక్షరీ అంటే మొదటి పద్యం చివరి అక్షరం రెండవ పద్యము మొదటి అక్షరంగా అలా వంద పద్యాలు కొనసాగుతూ ఉంటాయి. కాని ఆ కాంతి కూడా సరిపోలేదు.

అప్పుడు భూతత్తాళ్వారు ప్రేమ మూలంగా ఒక దీపాన్ని భగవదానుభూతిని పొందాలనే తీవ్ర తపన వత్తిగా జేసి, మరొక పద్యశతకం రచించాడు. ఆహా! ఏమద్భుతము! కాంతి అంతటా దివ్యంగా ప్రకాశించింది. పేయాళ్వారు శ్రీమన్నారాయణుని దివ్యకాంతి శోభతో సందర్శించి, మరొక పద్య శతకమును ఆసువుగా రచించి స్వామి వైభవమును కీర్తించాడు. మిగిలిన ఇద్దరూ కూడా శ్రీమన్నారాయణుని సందర్శించి, పరవశించి, ఇదంతా స్వామి తమను ఏకం చేయటానికి చేసిన అద్భుతమైన లీల అని గ్రహించి, దివ్యానుభూతి పొందారు. తరువాత ఆ ముగ్గురు యోగులు ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకొని, నారాయణ తత్త్వమును దేశం నలుమూలలా ప్రచారం చేయుటంలో నిమగ్నులై చివరికాస్వామిలో లయమైనారు. వైష్ణవ సంప్రదాయమును అనుసరించే భక్తులందరూ పొయ్‌గై, భూతత్త, పేయి ఆళ్వారులను ప్రథమ ఆళ్వారులుగా (మొదటి ప్రవక్తలు) ఆరాధిస్తారు.

*

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గత సంచిక తరువాయి)

- సుశీలా ప్రసాద

"నిన్న పొద్దుట వాకిలి చిమ్ముతుంటే వచ్చి 'నేనివాళ మీ యింట్లో అన్నం తింటాను' అన్నాడు. నా కెంతో సంతోషమై 'సరే!' అన్నాను. 'మరి వెండిపూల పెద్ద పీటవేసి, అరిటాకు తెచ్చి అందులో పెడతావా?' అన్నాడు. 'అదీ సరే!' అన్నాను. ఎప్పుడొస్తాడో తెలియదు. గుండెలు గుబగుబ లాడుతున్నాయి. మా యింటాయన పొలానికి వెళ్లాడు. అత్తగారేమో నిద్రపోతోంది. అలాంటప్పుడు వస్తే, చప్పుడవకుండా అన్నం పెట్టి పంపిద్దామనుకున్నాను. అయినా తను గోవుల వెంట అడవికి వెళ్ళాడు కదా! ఏ వేళప్పుడు వస్తాడో మరి! అనకుంటున్నాను. ఇంతలో అత్తగారు నిద్రలేచి వచ్చి ' అన్నం పెట్టవే' అంది. ఏం చెయ్యను? ఆవిడకి నట్టింట్లో అన్నం పెడుతుంటే అప్పుడొచ్చాడు! మనస్సు తికమక పడుతుంటే 'నాకు పీట వేయలేదే? ఆకేది?' అన్నాడు నడుం మీద చేతులు ఉంచుకుని. 'త్వరగా కానీ, మళ్ళీ వెళ్ళి గోవులను చూసుకోవాలి' అన్నాడు.

తను అడిగినట్లే పీఠవేసి, ఆకువేసి అన్నం పెట్టి మీగడ పెరుగు, పాయసం వేశాను. మరి ఊరగాయ ముక్క ఏదీ నంచుకోవడానికి పెరుగన్నం లోకి?' అన్నాడు. పీట మీద సగం ఖాళీ ఉంది. నన్ను తన పక్కనే కూర్చోమని, నోట్లో ముద్ద పెట్టమన్నాడు. అత్తగారు ఎక్కడ చూస్తుందోనని గుండెల్లో దడగా ఉంది నాకు. 'అల్లరి పిడుగనీ, దొంగ మొహమనీ' కృష్ణుణ్ణి తిడుతుంది ఆవిడకి అసలు ఇష్టంలేదు కన్నయ్య అంటే మరి. కానీ, చిత్రమేమంటే తన మానాన తను అన్నం తినేసి, లేచి వెళ్ళి చెయ్యి కడుక్కుని మళ్ళీ మంచం ఆశ్రయించింది. 'ఇదేం మాయ కృష్ణయ్యా!' అంటే కిలకిల నవ్వుతూ 'నేను మంత్రం వేశానులే' అని మూతి చెయ్యి కడగమని వీధిలోకి వెళ్ళిపోయాడు. ఇదంతా తలచుకుంటే ఎంతో ఆశ్చర్యంగా, చాలా ఆనందంగా ఉంది సుమా!"

వాళ్ళ మాటలు వింటుంటే అలివేణికి తమ మీద తనకే కోపం వచ్చింది. తన కర్మ అనుకుంది. లోలోపల ఉడుకుమోత్తనం కలుగుతుంటే తిరిగొచ్చి గుమ్మంలోనే కూర్చుండి పోయింది. గలగలపారే సెలయేరుల్లాంటి పడుచుతనం ఆ గోపికలది. కదలికలు లేని నీటిలా ఉన్న నడివయస్సు తనది.

వయస్సులు చూస్తాడా నందబాలుడు? మనస్సులు చూస్తాడా? ఆలోచనలతో నడిజాము దాకా నిద్ర పట్టలేదు. ఎప్పుడో కనురెప్పలు వాలి కునుకుపట్టిన అలివేణికి మెలకువ వచ్చేసరికి ఎండ చుర్రుమంటోంది. పెరట్లో ఆవు అంబా అని అరుస్తోంది. దూడ పాలకి విడిచిపెట్టమని గోలెడుతోంది. పాలు తియ్యాలి, పెరుగు చిలకాలి. ముగ్గులేని వాకిలి వెలవెల పోతోంది. ఎన్ని పనులు? ఊపిరాడ కుండా తిరుగుతోంది అలివేణి. గుమ్మంలో ఎవరిదో నీడ పడింది. కృష్ణుడేమో! అని ఆశగా తల తిప్పి చూసింది. 'ఆలసెం అయిపోతోంది తొరగా రారా అని అన్నం కూడా తిననివ్వకుండా గోవులతోబాటు నన్నూ తోలుకొచ్చేశారు సుబ్బన్న, సూరన్నలు. ఆకలేస్తోంది అన్నం పెట్టవా?' అని జాలిగా అడుగుతున్నవాడు కృష్ణుడు కాదు, ఎవరో పిల్లవాడు! తన ఊహ తప్పయినందుకు అలివేణికి కడుపులో మంట లేచింది. "ఇంకెవరినైనా అడుగు పో! ఇంకా కూడు ఉడకలేదు, కూర కాలేదు'' అని వాడిని కసిరి కొట్టింది. బిక్క మొహంతో వెళ్ళిపోయాడు వాడు.

సాయంకాలం యమునకెళ్ళి నీళ్ళు తెచ్చుకుని కడవ దింపుతుంటే పెరట్లో చప్పుడైంది. ఆత్రంగా వెళ్ళి చూస్తే జామచెట్టు మీద కాయలు కోస్తున్నాడు ఒకడు. కింద నిబలడి చూస్తున్నాడు ఇంకోడు. అవన్నీ కృష్ణుడి కోసం తాను దాచి పెట్టుకుని, వెయ్యి కళ్ళతో కాపలా కాస్తుంటే!! అలివేణికి నిలువెల్లా భగ్గుమంది. 'చెట్టు దిగుతావా, తన్నమంటావా' అంటూ కర్ర పట్టుకొచ్చి గావుకేకలు వేస్తుంటే, వాళ్ళిద్దరూ వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయారు.

సందె చీకట్లు ముదిరి, ఇల్లంతా చీకటిగా ఉంది. అలివేణి మనస్సు నిండా చీకటి. ఎలాగో దీపం వెలిగించింది. దీపం వెలుగులో పాలు, పెరుగులు, బానలో చిలికి అలాగే వదిలివేసిన వెన్న, వండిన అన్నం అన్నీ కనిపించాయి. ఏం చేయాలి? కృష్ణుడొస్తే కూడా పదిమందీ వస్తారు. అందరికీ సుష్టుగా సరిపోతాయి. కానీ.......... అలివేణికి తొలిసారిగా జీవితంలో వెలితిగా అనిపించింది. అదేమిటో అర్థం కావటం లేదు. దిగులుగా కళ్ళు మూసుకుని మంచం మీద పరున్న తనని వాకిట్లో ఎవరో పిలుస్తుంటే లేచి వెళ్ళింది. మసక చీకట్లో ఎవరో బైట నించే అడుగుతున్నారు, 'కన్నయ్య ఇంట్లోకి రావచ్చా?' అని అడగమంటున్నాడు'' అని. అలివేణి గుండె క్షణం ఆగినట్లయింది.

తడబడుతూ "రావచ్చా అని అడగటమేమిటి? సరాసరి రావచ్చునే'' అంది. ఈసారి గంభీరమైన స్వరం వినవచ్చింది. "మొన్నటికి మొన్న అన్నం

పెట్టమని అడిగితే కసిరి కొట్టావు. నిన్న జామకాయలు కోస్తుంటే తరిమికొట్టావు. తీరా ఇవాళ అడగకనే వస్తే ఏం చేస్తావో అని భయంగా ఉంది". పోల్చుకుంది అలివేణి. శ్యామసుందరుడు మాట్లాడుతున్నాడు. నిశ్చేష్ట అయి అలాగే నిలబడి పోయింది. కళ్ళ నిండా నీళ్ళు కారిపోతున్నాయి............ "నువ్వు నేను రావాలని అహర్నిశలూ కోరుకుంటున్నావని నాకు తెలుసు. ఏ రూపంలో వస్తానో ఎవరికీ తెలియదు. తీరా వస్తే గుర్తుపట్టలేరు." అలివేణికి దుఃఖం పొంగుకు వస్తోంది. ఎంత పొరపాటు జరిగింది?

"ఒక్కమాట చెబుతాను విను. నా కోసం చూస్తున్న నీకు, ఎవరిని చూసినా నా రూపమే కనిపించాలి. ఎందుకంటే అన్ని రూపాలూ నావే కనుక. అప్పుడు నీకు దుఃఖం ఉండదు. జీవితం వెలితి లేకుండా సుఖంగా సాగిపోతుంది."

అలివేణి తన మూర్ఖత్వం తనని ఎంత మోసగించిందో అలివేణి గ్రహించ గలిగింది. ఇంట్లోకి అడుగు పెట్టి, దగ్గరగా వచ్చి అనునయంగా బాలగోపాలుడు అలివేణితో అన్నాడు. "నిజం తెలుసుకున్న నువ్వికఎన్నడూ పొరబడవు. ఎక్కడి నుండో రానక్కర్లేకుండా నేనెప్పుడూ నీ యింట్లోనే ఉంటాను." రత్నాలు పొదిగిన అందెలు అలంకరించిన మనోహరమైన పాదార విందాలను చూస్తూ రెండు చేతులూ జోడించి తన్మయమై అలివేణి నిలచిన వేళ....... ఇల్లంతా వెయ్యి దీపాల వెలుగులు నిండి, ఎక్కడ చూసినా ఇల్లంతా గజ్జెల గలగలలే !

వ్రజ వీధులలో కాలి మువ్వల సవ్వడితో ఎల్లెడలా తిరుగాడే బాలకృష్ణుని దివ్యమైన పాదాలకు నమస్కరిస్తున్నాను. *

## శ్రద్ధాంజలి

ఆశ్రమవాసులైన డా॥మల్లాది విశాలాక్షిగారు (శ్రీ మల్లాది సురేష్ శాస్త్రి గారి భార్య) **24-3-2011** గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరు గత కొద్ది సంవత్సరాలుగా అస్వస్థతగా ఉంటున్నారు. వీరి వయస్సు **64** సంవత్సరాలు. వీరికి భర్త, ఒక కుమారుడు కలరు. శ్రీసద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

# శ్రీమాతాజీవారి ఉగాది సందేశం

- రమణ ప్రసాద్

శ్రీ వికృతి నామ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ శ్రీఖర నామ సంవత్సరం ప్రవేశించింది. 60 సంవత్సరాల పేర్లలో ఏదో హడలుగొట్టే సంవత్సరం పేరు వస్తే, మనం హడావిడిగా నక్షత్ర ఫలాలు చూసుకుంటాం. అయితే ప్రభువు నీడలో ఉన్న మనం భయపడవలసిన పని లేదు. ప్రారబ్ధం వల్ల వచ్చే కర్మ ఫలితాలు శ్రీగురుదేవుల అనుగ్రహం చేత పెద్దగా పోయేవి చిన్నగా పోతాయి. 'నీ ఆయుష్యు అయిపోయింది' అన్నవాళ్ళకు ఆయువును పోశారు గురుదేవులు.

కాలం ఎలా వెళ్తుందో తెలియటం లేదు. రాబోయే విపత్తులను తల్చుకుని భయపడుతున్నాం. ఒక దివ్యమైన శక్తి మనని నడిపిస్తోంది అని గుర్తించాలి.

'ఖరం' అంటే గాడిద అని అర్థం. విన్నది మననం చేయనివారు ద్విపాద పశువులు అవుతారు. విన్నది చక్కగా మననం చేసేవారు గాడిద కాని పశువు అవుతారు అని మన హృదయబాబు హెచ్చరిక చేస్తున్నారు. మననం చేయకపోతే గాడ్డి అవుతావు. మననంచేస్తే 'గాడ్డి గ్రేట్'ని గుర్తిస్తావు. అయితే మననం చేసే మాటలు సద్విషయం మాత్రమే అయి ఉండాలి.

భయంకరమైన ఖరధూషణాదులను సంహరించి ప్రజలలో భయాన్ని పోగొట్టాడు శ్రీరాముడు. రాక్షసులు సామాన్యులు కారు. ఖరదూషణాదులు రాముని చేతిలో హతమయ్యారు అన్న వార్త పాకింది. రావణుడు సీతాపహరణం చేయటంతో యుద్ధం అనివార్యమయింది. ఒకవైపు రాముని సేనలు, ఇంకొకవైపు రావణుని సేనలు యుద్ధానికి సన్నద్ధం అవుతున్నాయి. ఆకాశంలో గ్రద్దలు చేరి ఒక సమావేశం ఏర్పరచుకున్నాయి. అవి నాలుగు నిర్ణయాలు తీసుకున్నాయి.

1. మనం రథంపై ఎగిరే పతాకం మీద వాల్దాం. అది నశించినట్లే.

2. తరువాత ముసలివాళ్ళు - జాంబవంతుడు మున్నగువారు సంహరించిన మృతదేహాలను మనలో పడుచువాళ్ళు తినండి.

3. బాగా పచ్చిడి పచ్చిడి అయిన వాళ్ళను మనలో వృద్ధులు తినండి.

4. శ్రీరాముడు ఎవరిని సంహరిస్తాడో ఆ మృతదేహాన్ని తెచ్చి కొండ మీద దాయండి. దానిని మనం కొంచెం కొంచెంగా తిందాం. (అది ప్రసాదం అనే విషయం వాటికి తెలుసు.)

ఖరుడు రామునిచేత సంహరింపబడ్డాడంటే వాడి జన్మ ధన్యమైంది. అటువంటి రామతత్త్వాన్ని మనకు తెలియచేసింది మన గురుదేవులు. ఆగురు సన్నిధే పెన్నిధి అనుకున్నవాడికి భయమెక్కడి నుంచి వస్తుంది?వానరులు శ్రీరాముని ఎలా ఆశ్రయించి తరించారో అలా మనం శ్రీగురుదేవులను ఆశ్రయించి తరించాలి.

శ్రీగురుదేవులు అందరికీ పుత్రపౌత్ర ధన ధాన్యాలను, అఖండ ఐశ్వర్య ఆయురారోగ్యాలను, అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములను ప్రసాదించెదరు గాక! సుఖీభవ! సుఖీభవ!!

## అంతా నటనే

**ఒక దంపతుల యింటికి చుట్టం వస్తున్నాడు. అది చూసిన దంపతులు అతణ్ణి రాకుండా చెయ్యటానికి పోట్లాడుకుంటున్నట్లు నటించారు. చుట్టం వెళ్ళిపోయాడు.**

**"నిన్ను కొట్టినందుకు ఏమీ అనుకోవద్దు. అంతా నటనే" అన్నాడు భర్త అనునయంగా.**

**"నేను మాత్రం మిమ్మల్ని నిజంగా తిట్టానా ఏమిటి? అంతా నటనే" అన్నది భార్య.**

**"నేను మాత్రం నిజంగా వెళ్ళానా యేమిటి? నాదీ నటనే" అంటూ గోడచాటు నుంచి వచ్చాడు చుట్టం.**

# శ్రీ బాబూజీ దివ్యవాణి

"ఒకవైపున అనుక్షణమూ నిర్విరామంగా వినిపించే యంత్రాల రొదతోను ఆకలి తీరని కార్మికుల నినాదాలతోను చెవులు చిల్లులు పడుతుండగా, మరొక వైపున పాలనా వ్యవస్థలోని సమస్యలతోను, పరిష్కారం కుదరని వివాదాలతోను మతులు పోతుండగా, స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకునేందుకు కూడా తీరికలేని మా పారిశ్రామికుల జీవితాలలో ఏదైనా ఆధ్యాత్మిక సాధనకై ప్రయత్నించటానికి గాని, అందులో యే మాత్రమైనా పురోగతి సాధించటానికి గాని ఇసుమంతమైనా అవకాశం ఉందంటారా?"

కలకత్తాలో ఒకప్పుడు అనేకమంది పారిశ్రామికవేత్తలతో జరిగిన గోష్ఠిలో ఒకరు శ్రీ హనుమత్‌కాళీ వరప్రసాద బాబుగారిని ప్రశ్నించగా 'అది తప్పక సాధ్యమే' అని నొక్కి చెబుతూ, పారిశ్రామిక రంగంలో వారంతా జరిపే కృషిని అర్థవంతమూ, అత్యంతలాభదాయకమూ అయిన కర్మయోగసాధనగా ఎలా మలుచుకోవచ్చునో, తమకూ, తమ కుటుంబాలకూ సంపద సాధించుకుంటూనే దేశ ప్రగతికి, విశ్వ కళ్యాణానికి కూడా ఏ విధంగా దోహదం చేయవచ్చునో శ్రీబాబుగారు వివరంగా విశదీకరించారు.

'నీ విధిని నిర్వహించు, ఫలితం నాకు వదిలిపెట్టు' ఇదే భగవానుని గీతా సందేశసారం. "కర్మయోగం" అన్నదానికి సూత్రప్రాయమైన నిర్వచనం కూడా ఇదే. ప్రతి మానవునికి ఈ క్రింది ఆచరణ సూత్రాలను కర్మయోగం నిర్దేశిస్తోంది.

1. ఎప్పుడూ క్రియాశీలుడవై ఉండు. సోమరితనాన్ని ఎన్నడూ దరి చేరనీయకు. "క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప" - "శత్రువులను తపింప చేసే ఓ అర్జునా! జుగుప్సాకరమైన ఈ నిష్క్రియత్వమనే గుండె జబ్బును వదిలి పెట్టి ధీరుడవై లే" యుద్ధరంగంలో అస్త్ర సన్యాసం చేసి చతికిలబడిన అర్జునునితో గీతాచార్యుడన్న మాటలివి.

2. ఏ వృత్తి నీకు లభ్యమవుతుందో అది దైవ నిర్ణయంగా భావించి శ్రద్ధతోను, తత్పరతతోను దానిని ఆచరించు. విధి నిర్వహణ కేవలం జీతపు రాళ్ళకోసమే కదాని, అది నిన్ను భగవానునికి దగ్గరగా చేర్చకలదని గ్రహించు. 'యోగఃకర్మసు కౌశలం' - పనిలో నేర్పు చూపడం కూడా యోగమే.

3. శ్రీ భగవానుని ప్రతినిధిగా మాత్రమే నీవు నీ విధిని నిర్వహిస్తున్నావని, ఏయే ఫలితాలను ఏ సమయంలో నీకు ఎలా అందివ్వాలో ఆ భగవానునికే తెలుసునని గ్రహించి, అలా యే ప్రతిఫలం నీకు లభించినా సమ దృష్టితో, తృప్తితో స్వీకరించటం నేర్చుకో. 'కర్మణ్యే వాధికారస్తే, మా ఫలేషు కదాచన' - పని కోసమే పని చెయ్యిగాని ఫలితం కోసం కాదు.

4. నీ శ్రేయస్సు, నీ కుటుంబ శ్రేయస్సు ముఖ్యమే అయినా, నీ మీద ఆధారపడిన వారందరి శ్రేయస్సు, దేశ శ్రేయస్సు అంత కంటె ముఖ్యమైనవని గుర్తుంచుకో.

5. నీ విధి నిర్వహణలో ఎన్నడూ ఎవ్వరికీ యిసుమంతైనా హాని కలుగనీయకు.

ఇదే కర్మ యోగ సారాంశం. దీనిని శ్రద్ధగా ఆచరించిన మానవుడు ఉన్నత ఆధ్యాత్మిక శిఖరాలను అందుకోగలడు.

ఈనాటి పారిశ్రామిక రంగంలో అవినీతి, నిర్వహణ యంత్రాంగంలో సమస్యలు, అలజడులు, కార్మికులలో అశాంతి, వాటాదార్లలో అభిప్రాయభేదాలు, మాటిమాటికి సమ్మెలు, మూసివేతలు పెచ్చుమీరి పోయాయి. మానవునిలో పెరిగిపోతున్న దురాశ, స్వార్థము దీనికి కారణం. ఎన్ని లాభాలు ఆర్జిస్తున్నా తృప్తి లేదు కొందరికి. ఎంత జీతం వచ్చినా ఆకలి తీరడం లేదు కార్మికులకు. ఫలితం పరస్పర ద్వేషం, విరోధం. దీనికంతటికి మూలకారణం, మానవుడు అవ్యాజ కరుణామూర్తి అయిన భగవానుని మరచిపోవటమే. *

---

**ఛాందోగ్యంలో శ్వేతకేతువు కథ ఉన్నది. శ్వేతకేతువు అన్నం మాని కేవలం నీళ్ళు తాగుతూ పక్షం గడుపుతాడు. చదువుతున్న వేదం మరచిపోతాడు. మళ్ళీ అన్నం తిన్న తరువాత వేదం గుర్తుకు వస్తుంది. అన్నానికి మనస్సుకి సంబంధం ఉంటుంది. కాబట్టి బొత్తిగా పస్తులు ఉండేవాడు ప్రజ్ఞను కోల్పోతాడు. ఈ పద్ధతి యోగానికి పనికిరాదు.**

**యోగాభ్యాసానికి పనిపాటలు యుక్తంగా ఉండాలి. అధికంగా దేహశ్రమ చేసినవాడు ధ్యానం చెయ్యలేడు.**

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## తుని

తునిలో శ్రీబాబుతో అత్యధిక సాన్నిహిత్యం పొందిన వారు, యిప్పటికీ పొందుతున్నవారు దాసరి కుటుంబమువారు. దాసరి బ్రహ్మయ్యగారి కుమారులు సుందరంగారు, వీర్రాజుగారు, వెంకన్నబాబుగారు, దేవళ్ళుగారు. అందరిలో చిన్నవారైన దేవళ్ళు గారు శ్రీబాబును గూర్చి వ్రాసిన వివరాలలో, శ్రీబాబుకు తుని గ్రామస్థులతో 1936 నుండే పరిచయం ఉందని శ్రీబాబే చెప్పారన్నారు. తుని రాజావారి దివాణంలో ఉప్పల వెంకట రమణ గారు షరాబుగా ఉండేవారని, వారి యింటికి శ్రీ బాబు వస్తూ ఉండేవారని, వారింట్లో దేవతార్చన ఉంచి పూజిస్తూ ఉండేవారని వ్రాశారు. "గురువుగారు"అని శ్రీబాబును పిలిచేవారు. తమకు మాత్రం 1942 నుండి శ్రీబాబుతో పరిచయం ఏర్పడిందని దేవళ్ళు గారు చెప్పారు.



వెంకటరమణగారు తమ గృహ సమస్యల నివారణ నిమిత్తం శ్రీబాబును ఉప్పాడ నుండి మొదటిసారిగా తుని తీసుకుని వచ్చారు. శ్రీబాబును గూర్చి దాసరి సుందరంగారి భార్య కామరాజుగారు విన్నారు. ఆమె భక్తురాలు. ఆమె ఉప్పల వెంకరమణగారింట్లో పూజలకు వెళ్ళి, శ్రీబాబు దర్శనం చేసుకొనేవారు. భర్త సుందరంగారికి ఎప్పుడూ వ్యాపారము, ధన సంపాదన మీదేగాని ఆధ్యాత్మిక విషయాల మీద ధ్యాస ఉండేది కాదు. వారి

శ్రీమతి శ్రీబాబును గూర్చి చెప్పి, వారి దర్శనం చేసుకుంటే వ్యాపారంలో కూడా లాభం వస్తుందని పోరు పెట్టగా, సుందరంగారు ఒకసారి శ్రీబాబు దర్శనానికి వచ్చారు. "ఏమండీ సుందరంగారూ? మీ శ్రీమతిగారు ఒకటే పోరు పెట్టి మిమ్మల్ని తీసుకు వచ్చారా? అయ్యో! పాపం! వ్యాపారమంతా అలా వదిలేసి యిక్కడికి వచ్చారా? ఇలా మహాత్ములంటూ, దర్శనాలంటూ

కాలం వృధా చేస్తే, వ్యాపారం ఏమైపోతుందండీ? ఏమంటారు?'' అని శ్రీబాబు అనేసరికి సుందరంగారికి భయం పుట్టింది. "ఈయన ఎవరోగాని, నా మనస్సులో ఉన్నదీ, యింట్లో జరిగిందీ అంతా చెప్పేస్తున్నాడే? మహానుభావుడే అయిఉండాలి'' అని అనుకున్నారు. అప్పటినుండి సుందరంగారికి కాస్త గురి కుదిరింది. తునిలో చెక్కా వెంకట శెట్టి గారు, పంచాయితీ ప్రెసిడెంట్ కక్కరాల సత్యంగారు, బొండాడ నూకరాజుగారు, దేవత చిన కనకయ్యగారు, గ్రంధి బుచ్చిరాజు గారు మొదలైన వారందరూ శ్రీబాబుతో బాగా పరిచయంగల వారు. అప్పట్లో సంవత్సరంలో ఆరు నెలలు శ్రీబాబు తునిలో ఉంటే, ఆరు నెలలు పాపికొండలలో ఉండేవారని దేవళ్ళుగారు చెప్పారు. తుని వద్ద ఉన్న తాండవ నదిలో యిసుక తిన్నెల మీదికి శ్రీబాబు, దేవళ్ళుగారు వెళ్ళేవారు. ఇద్దరూ యిసుకలో దోపుడు పుల్లల ఆట ఆడుకునేవారు. దేవళ్ళుగారి పుల్లను శ్రీబాబు మాయం చేసేవారు. పిల్లలతో ఆడుకునేటప్పుడు వాళ్ళను సంతోష పెట్టడానికి తమాషాలు చేసి చూపించేవారు శ్రీబాబు.

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో తునిలో రైల్వే లైను వేయటం కోసం ప్రభుత్వం వారు ఇళ్ళు ఖాళీ చేయించారు. అప్పుడు శ్రీ బాబు తాము సుందరం గారి యింట్లో ఉండి, మిగతా దాసరి వారి కుటుంబమంతటిని మరో గ్రామం పంపించి వేశారు. అప్పట్లో తమ అడ్రస్సు c/o. అన్నా కోటిలింగంగారు, శ్రీకాళీట్రంకు ఫ్యాక్టరీ, గుంటూరు అని యిచ్చారట. రెండో ప్రపంచ యుద్ధం 1939 నుంచి 1945 దాకా జరిగింది. అంటే గుంటూరులో అన్నా కోటిలింగంగారి యింటికి వెళ్ళిన రోజులలోనే, శ్రీబాబు తునిలో కూడా వెల్లడి అయి ఉండవచ్చును.

తునిలో శ్రీబాబు ప్రధమంగా ప్రకటన అయిన విషయం మాత్రం యిక్కడ ప్రస్తావించబడింది. తుని భక్తులతో శ్రీబాబు తరువాత కాలంలో సంచరించిన వివరాలు వేరే అధ్యాయంలో పేర్కొన బడినవి. *

**ధర్మం ఎదుట దీనత్వం, దర్పం ఎదుట ధీరత్వం -**
**ఇది భక్తునికి భాగవతునికి ఉండవలసిన ధర్మం.**

# గిరిజా విజయం

(గత సంచిక తరువాయి) -సుశీలా ప్రసాద

సర్వోత్కృష్టమైన వస్తువుని పొందాలంటే ఎంతో గొప్ప సాధన అవసరం. అందుకు ద్వంద్వాలు నిర్జించి, దేహేంద్రియాలను నియమించి, యోగాన్ని ఆవలంబించి జయాన్ని వరించాలి. అర్ధశరీరాన్నిచ్చేంత అనురాగంగల మృత్యుంజయుడైన భర్త లభించాలంటే తపస్సే మార్గమనుకుంది పార్వతి. ఈశ్వరుని యందే మనస్సు నిలిపి తపస్సు చేయడానికి నిశ్చయించుకున్న పార్వతిని **'ఉ'** - ఓ చిన్నదానా! **'మా'** - తపస్సు వద్దమ్మా! (ఉమా!)అని బ్రతిమాలిన తల్లి ఆమెను వారించలేకపోయింది. చెలికత్తె చేత ' అడవికి వెళ్ళి తపస్సు చేసుకుంటాను అనుజ్ఞ ఇమ్మన'మని తండ్రిని అడిగించింది. ఆమె పట్టుదలకి సంతోషించిన హిమవంతుడు తన అంగీకారం తెలిపేసరికి ఆమె ఆనందానికి అవధులు లేకపోయాయి. నెమళ్ళు ఎక్కువగా ఉన్న గౌరీశిఖరమనే పేరుగల ప్రదేశానికి వెళ్ళింది గౌరి. (అది ఆమె పేరుతోనే ప్రసిద్ధిచెందింది.) మెడలోని ముత్యాలహారాలు తీసివేసి మొలకు ముప్పేట ముంజత్రాడును ధరించింది. బాల సూర్యునివంటి కాంతిగల నారచీరెను కట్టుకొన్నది. తలను జటలుగా చేసి, అలంకారాలు మానివేసింది. దర్భలు కోస్తూ , జపమాలను త్రిప్పుతూ స్నానం హోమం స్తోత్రాలు చేస్తూ తపోనియమంలో ఉన్న పార్వతీదేవిని పెద్దలైన ఋషులెందరో చూడ వచ్చారు. పర్ణశాలలో అగ్నిహోమం, అతిథి పూజలు చేసే ఆమె తపోవనం అతి పవిత్రమై అలరారింది. ఈ విధంగా తన వాంఛాఫల సిద్ధికి ఆమె శరీర శ్రమను కూడా లెక్కించక తీవ్రమైన తపస్సు చేయటానికి పూనుకున్నది.

నాలుగు అగ్నుల నడుమ నిలచి కళ్ళు మిరిమిట్లు గొలిపే తేజస్సుకల సూర్యుని చూస్తూ గ్రీష్మఋతువులో తపస్సు చేసింది. పంచాగ్ని హోమ మధ్యంలో నిలిచిన ఆ దేవి ఒంటి నుంచి, కాగిన భూమి నుంచి, తొలకరి వానలు కురిసినప్పుడు ఆవిరి లేచింది. ఆ తొలినీటి చుక్కలు ఆమె మూసిన కనురెప్పలందు నిలచి, అక్కడి నుంచి పెదవుల పైకి జారి, వక్షస్థలంపై పడి చెదరి, కడుపు మడతల నడుమ కొంతసేపు నిలచి, పిమ్మట లోతైన నాభిలో ప్రవేశించాయి. వర్షఋతువులో తెరిపిలేకుండా కురిసే గాలివానల సమయంలో, ఆమె ఆరుబైట బండ మీద పరున్నప్పుడు ఆమె తీవ్రమైన తపస్సుని రాత్రులు

కళ్ళారా చూస్తున్నట్లు సాక్ష్యంగా మెరుపులు మెరుస్తుండేవి. ఆయాచితంగా లభించే నీటిని, శరదృతువులో అమృతాత్ముడైన చంద్రుని కిరణాలను గ్రోలుతూ గడిపిన పార్వతి, హేమంత సమయంలో నీటిలో నిలిచి చలికి వణుకుతూ విడువక తపస్సు కొనసాగించింది. శిశిరంలో రాలే ఆకులను కూడా తినకుండా తపస్సు చేసినందున ఆమెను **అపర్ణ** అని పిలిచారు. తామరతూడు వంటి సుకుమారమైన తనదేహాన్ని అగ్ని జల స్థలాలందు నిలిచే క్షణాలలో రాత్రింబవళ్ళు కృశింపచేస్తూ, ఆమె చేసిన కఠినమైన తపస్సు దృఢకాయులైన మునుల తపస్సును మించిపోయింది. అలాటి వేళ..........

నల్లచారల లేడి చర్మం, మోదుగ కర్రను ధరించిన బ్రహ్మతేజస్సుగల ఒక బ్రహ్మచారి ఆమె ఆశ్రమంలోకి ప్రవేశించాడు. అతిధి సేవా పరాయణ అయిన పార్వతి ఆ బ్రహ్మచారిని సగౌరవంగా ఎదుర్కొని పూజించింది. విధ్యుక్తమైన ఆమె పూజలను గ్రహించి క్షణకాలం ఆయాసం తీర్చుకొని ఆమెతో "హోమాలకు కావలసిన దర్భలు, స్నానానికి నీళ్ళు అన్నీ లభించి, శక్తికొద్దీ తపస్సు చేస్తున్నావు కదా! **శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం** అన్నారు కదా పెద్దలు! సత్పురుషుల యొక్క స్నేహం, ఏడుమాటలు పలకటం వలన లభిస్తుందని విద్వాంసులు అన్న వాక్కుచేత, నీ చేత పూజలు గ్రహించిన నన్ను అన్యునిగా భావించకపోయినట్లయితే స్నేహధర్మంతో నిన్ను కొంచెం ప్రశ్నిస్తున్నాను. రహస్యం కాకపోతే సమాధానమిస్తావు కదా!" అన్నాడు. పార్వతి వినయంగా అంజలి ఘటించి తలవంచగా అతగాడు తన పలుకులను కొనసాగించాడు........

"బ్రహ్మవంశంలో జన్మించావు. ముల్లోకాలలో ఉన్న సౌందర్యమంతా ఒకచోట చేర్చినట్లు ఉన్నావు నువ్వు. సంపదలకా కొరతలేదు. ఇంతకన్నా ఏమికోరి తపస్సు చేస్తున్నావు? నువ్వు స్వర్గం కోరి చేస్తున్నావా అంటే నీ తండ్రికి చెందిన ప్రదేశాలన్నీ దేవతా నివాసాలే. ఇక వరుని గురించి తపస్సా అంటే అనర్ఘ్యమైన మణి తనను ధరించే వారెవరా అని వెతకదు. దానిని ధరించే వారే మణి ఉన్న తావును వెదుక్కుని వస్తారు". ఇలాగ ప్రౌఢమైన వాక్కులు పలికే బ్రహ్మచారి మాటలు వింటూ పార్వతీదేవి ఒక నిట్టూర్పు విడిచింది.

- సశేషం.

# మన సాధన ఎందుకు ఫలించటం లేదు?

(గతసంచిక తరువాయి)

-వెంకట రమణ ప్రసాద్

**దానము-** 'దీయతే దానమ్' అమరము. దానము అనగా ఇచ్చుట. పురాణములలో దశదానములు, షోడశ దానములు చెప్పబడి యున్నవి. ఆధ్యాత్మిక సాధనకు ప్రధానమైనది దానము. అందువలననే శ్రుతి "త్యాగేనైకే అమృతత్వ మానశుః" అని చెప్పినది. దానము లేక అమృతత్వము లేదు.

దానములలో అనేక విధములున్నవి. అన్నదానము, భూదానము, వస్త్రదానము మొదలగు దానములు సామాన్యములని చెప్పబడినది. వీని కన్న విద్యాదానము గొప్పదనియు, దానికన్నను జ్ఞానదాన మత్యంత యోగ్యమనియు నిర్ణయింపబడినది. వ్యాసమహర్షి శుకునకు భాగవతమును, జ్ఞానప్రాప్తి సాధనమును విపులముగా నుపదేశించి దీనిని 'నిర్మలాత్ముడగు' తపస్వికి ఉపదేశింపుమని యాదేశించిరి.

**అతుల వేదాంత శాస్త్ర మహాంబురాశి**
**ద్రచ్చి పుచ్చిన నవనీత మిచ్చితిని, స**
**మాదరంబున గైకొను మనుసరించు,**
**నిర్మలాత్మ తపస్వికి నీవు నొసగు** (భారతము, శాంతి. 5-158)

ఆ సందర్భముననే విద్యాదానమును ప్రత్యేకముగ ప్రశంసించుచు, సకల భూమండలమును దానమిచ్చిన దానికంటె ఆధ్యాత్మజ్ఞానమును బోధించుట వలన కలిగెడు సుకృతము (పుణ్యము) గొప్పదని బోధించెను.

**సకలరత్న పూర్ణ సర్వవసుంధరా**
**చక్రదాన విధియు సరియనంగ**
**రాదు విశ్వ వేదరాశి సారాధ్యాత్మ**
**విద్య యిచ్చుటకు వివేక ధుర్య** (భారతము, శాంతి. 5-159)

కనుక దానమీయ వలెనన్నచో ప్రతివాడును జమిందారో, చక్రవర్తియో యయి యుండనవసరము లేదు. తాను విద్వాంసుడైనచో తత్త్వమును బోధింప వచ్చును. విద్వాంసుడు గాకపోయినను ఆధ్యాత్మ విద్యావిషయమున సాధకుడు గూడ దాత కావచ్చును.

**తపము** - యజ్ఞ దానముల తరువాత చిత్తశుద్ధి కానుకూల్యత కల్గించు సాధనగ తపస్సు చెప్పబడినది. ఈ తపస్సొక రెండంచులను పదునుగల కత్తి

వంటిది. ఇది మానవుని చేతిలోని ద్రవ్యము వంటిది. ధనమును సత్కార్యములను జేయుటకు వినియోగించుటకెంత యవకాశమున్నదో, దుష్కార్యము లొనర్చుటకు గూడ నంతే యవకాశమున్నది. కృత, త్రేతాయుగములలో తపస్సులకు విశేష గౌరవమున్నట్లు ఆకాలపు సాహిత్యము వలన తెలియుచున్నది.

భగవానుడు గీతలో మూడు విభిన్న రీతుల తపస్సులను గూర్చి తెలిపినాడు. అందులో మొదటిది శారీరక తపస్సు.

**దేవ ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం శౌచ మార్జవం**
**బ్రహ్మచర్య మహింసాచ శారీరం తప ఉచ్యతే** (17-14)

దేవతలను (తల్లిదండ్రులను) బ్రాహ్మణులను, గురువులను, ప్రాజ్ఞులను (పెద్దలను, జ్ఞానులను) పూజించుట, శుచిగా నుండుట, బ్రహ్మచర్యమును పాటించుట, ప్రాణిహింస చేయకుండుట, అనువానిని పాటించుట శారీరక తపస్సని చెప్పబడినది. ఇచ్చట 'బ్రహ్మచర్య'మను మాటకు ఋతుకాలమున ధర్మబద్ధమైన భార్యా భర్తల సంయోగము మాత్రమే బ్రహ్మచర్యమని పెక్కురు పెద్దలచే నిర్ణయింప బడినది. 'శరీరం చేత, శరీరంలో ఉన్న అంతఃకరణాదులచే కూడ చేయబడేదైనా వాటిలో శరీరం ప్రధానమైనదవటం వలన ఇది శారీరక తపస్సనబడుతుంది' అని బాలానందిని వ్యాఖ్యానం.

శారీరక తపస్సు తరువాత రెండవది వాగ్రూపమైన తపస్సు. అనగా మనము మాట్లాడు మాటల వలన కూడ తపస్సు నిర్వహింపబడగలదని భగవానుని అభిప్రాయము.

**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియం హితం చ యత్**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే (17-15)**

ఇతరులకు ఉద్వేగము, నొప్పి కలిగించని, సత్యమై, ప్రియమై, హితమును కలిగించు వాక్యములను పలుకుట, స్వాధ్యాయము (వేదాంత పఠనము) నభ్యసించుట అనునవి వాగ్రూపమైన తపస్సు. దీనినే గీత 'వాఙ్మయం తపః' అంటుంది. ఇక మానసిక తపస్సు మూడవది. దీనిని గురించి భగవానుడు

**మనః ప్రసాద స్సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః**
**భావ సంశుద్ధిరిత్యేతత్తపోమానసముచ్యతే** (17-16)

అని చెప్పినాడు. మనస్సును 'ప్రసాదముగ' (నిర్మలముగ) నుంచుకొనుట, సౌమ్యముగ నుండుట, మితముగ భాషించుట, మనో నిగ్రహమును కలిగియుండుట, కపటము లేకుండ ప్రవర్తించుట మానసిక తపస్సని

చెప్పబడినది. చక్కని శ్రద్ధతో కోరికలుగాని, ఫలములపైన అపేక్షగాని లేకుండ ఈ మూడు విధములైన తపస్సులను నిర్వహించుట సత్వగుణ ప్రధానమైన తపస్సు. దీని వలన చిత్తశుద్ధి గలిగి శ్రవణాదులాచరించుటకు కావలసిన యోగ్యత లభించును.

ఫలాపేక్షతో చేసెడి తపస్సు రాజసిక తపస్సు అనబడుతుంది. దీనిని ఇతరులను బాధించుటకు గూడ ప్రయోగించ వచ్చును. ఘోరతపస్సులు చేసిన రావణ, హిరణ్యకశిపాదులు తమ తపస్సును లోకములను బాధించుటకు వినియోగించిరి. సౌబరి యను తపస్వి తన తపోబలముతో మాంధాత కుమార్తెలను వందమందిని పెండ్లాడి యద్భుత భవనములను నిర్మించుకొని సుఖించెను. మాందకర్ణియను ముని తన తపో బలముతో సరోవరమున మందిరమును నిర్మించి అప్సరసలతో క్రీడించెను. కనుక ఉగ్ర తపము వలన మంచి చెడులు రెండును జరుగుట కవకాశమున్నది. సహజముగనే కోపమునకు, పొగడ్తలకు లొంగిపోవు సాధకులకు తపస్సు వలన శక్తులు సంక్రమింపగా వాని వలన లాభముకన్న నష్టమే ఎక్కువ జరుగునను విషయమును కౌశికుడు, జాబాలి మొదలైన ఉగ్ర తపస్వుల కథలుగా మనకు పురాణములు తెలియజేయుచున్నవి. కనుక మందాధికారులు చిత్తశుద్ధి కొరకు 'స్వల్ప తపము చేయుటయే యుక్త'మని పెద్దలచే నిర్ణయింపబడినది.

సాధకుడు బ్రహ్మజ్ఞానము కలిగిన తరువాత యజ్ఞ దాన తపములు చేసిన చేయువచ్చును. లేక మానిన మానవచ్చును. ఈ విషయమున మైత్రేయోపనిషత్తులో నొక కథ యున్నది. బ్రహ్మజ్ఞానియైన మైత్రేయుడు శ్రుతి విహితమైన సంధ్యోపాసన మానివేసెను. దానిని గూర్చి 'నీవేల సంధ్యావందనము మానితి' వనగా నా ఋషి.

**మృతా మోహమయీ మాతా, జాతో బోధమయస్సుత:**
**సూతక ద్వయ సంప్రాప్తౌ, కథం సంధ్యా ముపాస్మహే ?**

అని తిరిగి ప్రశ్నించెనట. 'మోహమను నా తల్లి చనిపోయి నాకు సూతకము వచ్చినది. జ్ఞానమను పుత్రుడు పుట్టి పురిటి సూతకము వచ్చినది. ఈ విధముగ రెండు సూతకములు సోకిన నేను సంధ్యనెట్లునుపాసించగలను?' అని యర్థము. దీనిని బట్టి జ్ఞాని సర్వతంత్ర స్వతంత్రుడనియు, అట్టి వానికి విధినిషేధములు లేవనియు తెలియుచున్నది. *

# పుట్టగానే పరిమళం వెదజల్లే పువ్వు

- పరాశర ప్రసాద్

పువ్వు పుట్టగానే అది పరిమళం వెదజల్లుతుంది. అది యదార్థమే. కాని అన్ని పువ్వులూ అలా కాదు. పరిమళం వెదజల్లే పువ్వులు వేరు. అందువలననే వేమనగారు "పురుషులందు పుణ్యపురుషులు వేరయా" అన్నారు. అలాగే మహాత్ములు కారణ జన్ములు. వారి జీవితం ఇతరులకి మార్గదర్శకంగా ఆదర్శప్రాయంగా ఉంటుంది సుమా. దానిని బాల్యంలో ఎవరూ గుర్తించలేరు. సమయం వచ్చినప్పుడు అది బహిర్గతమవుతుంది.

శ్రీకృష్ణ భగవానుడు సామాన్య మానవుని వలె సంచరించాడు. ఆయనని అవతార పురుషునిగా పాండవులలోగాని, కౌరవులలోగాని ఎంతమంది గుర్తించ గల్గారు? అలా గుర్తించ గల్గితే కురుక్షేత్ర సంగ్రామం జరగవలసిన పని ఏముంది? శ్రీకృష్ణ రాయబారంతో సమస్య ముగింపుకు వచ్చేదే కదా!

శ్రీమాతాజీవారు 'చంద్ర' అనే నామధేయంతో శ్రీబాబూజీ మహరాజ్‌వారికి గురుసేవ చేసుకుంటూ సాధనలో ఒక్కొక్క మెట్టుపైకి ఎగబ్రాకుతూ దానికి తార్కాణంగా తమతో సంచరించే తోటి సహచరులతో అవకాశం దొరికినప్పుడు గురుతత్త్వాన్ని చర్చిస్తూ తమ క్షేత్రాన్ని బలపరచుకొనేవారు.

ఒకనాడు శ్రీమాతాజీ ఒక బాలభక్తురాలిని పిలిచి సద్గురుదేవుల అవసరార్థం అని ఎవ్వరికి చెప్పకుండా ఒక పాత్ర తీసుకుని వెళ్ళి చంద్ర పంపింది. పెరుగు కావాలని చెప్పి, నీకు తెలిసిన ముగ్గురు వ్యక్తుల దగ్గరకి ఒకరి తర్వాత ఒకరి దగ్గరకు వెళ్ళమన్నారు.

మొదటి వ్యక్తి వచ్చిన బాల భక్తురాలితో "చూడమ్మా! నా దగ్గర దైవ కార్యానికి మాత్రం వినియోగించటానికి పెరుగు ఉంది. దైవకార్యానికి అయితే ఇస్తాను అన్న సమాధానంతో ఆ వ్యక్తితో పని పూర్తి అయింది.

ఇంక రెండవ వ్యక్తి నోటితో లేదనకుండా "చంద్ర పంపినదా అయితే ఉండు'' అని ఒక స్పూన్‌తో కొంచెం పెరుగు పాత్రలో వేయటం జరిగింది.

మూడవ వ్యక్తి విషయానికి వస్తే అడిగినదే తడవుగా తెచ్చిన పాత్ర నిండా పెరుగుపోసి తీసుకెళ్ళమ్మా అని ఇచ్చి పంపారు.

ఈ జరిగిన విషయాన్ని గురించి అప్పటి చంద్ర అనబడే శ్రీమాతాజీ గారు బాలభక్తునితో ముచ్చటిస్తూ "చూశావా? మనుష్యుల వ్యక్తిత్వాలు ప్రపంచంలో ఎలా ఉంటాయో. మనకి కావలసినది ఏమిటో, మనకి ఏది ఇస్తే మనము తృప్తి చెందుతామో మన అవసరం ఏమిటో ప్రపంచంలో ఎవరికీ తెలియదు. దానిని తీర్చగల్గినది గురుదేవులు ఒక్కరే అన్న విషయం ఈ సంఘటన ద్వారా అర్థం చేసుకోవాలి.

మొదటి వ్యక్తి ఇవ్వనందుకు ఆ వ్యక్తిమీద ద్వేషం పెంచుకోకూడదు. దైవకార్యనికైతే ఇస్తాన్నారు కాబట్టి తప్పు పట్టనవసరం లేదు.

రెండవ వ్యక్తి మనకి కావలసినంత ఇవ్వనందుకు పిసినారి అని వ్యాఖ్యానించ కూడదు. మన అవసరం తెలియదు కాబట్టి అడిగినందుకు కొద్దిగా ఇచ్చారు.

ఇంక మూడవ వ్యక్తి అడిగిన వెంటనే సమృద్ధిగా అందజేసినందుకు దానకర్ణుడని అనుకోకూడదు. తన దగ్గర ఎక్కువగా ఉందేమో అది అవసరానికి ఉపయోగపడుతుందిలే అని ఎక్కువ ఇచ్చి ఉండచ్చు.

కాబట్టి లభించిన దానితో తృప్తిపడి కాలం గడుపుకోవటం మన జీవిత లక్ష్యం. మనకి కావలసినదాన్ని ప్రసాదించ గల్గినది సద్గురుదేవులు మినహా ఇంకెవ్వరూ ఇవ్వలేరు. మనకి ఏది లభిస్తే అది గురుదేవులే ప్రసాదించారు అని భావించటం తగిన పని అన్నారు శ్రీమాతాజీ. *

నోట్లో ఉప్పుగల్లు పెట్టుకుని ఎంత మంచి మిఠాయి తిన్నా రుచిగా ఉండదు. వెనుకటి విషయ వాసనలను అంతఃకరణంలో పెట్టుకుని యెన్నెన్ని మార్లు వేదాంత శ్రవణం చేసినా అది రుచించదు. అర్థం కాదు.

# మౌనధ్యాన సప్తాహ శిబిరం

-రమణ ప్రసాద్

(ది. 5-4-11 నుండి 11-4-11వరకు శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమంలో శ్రీ మాతాజీవారి పర్యవేక్షణలో నిర్వహించబడిన శిబిరంలో 93మంది పాల్గొన్నారు. పాల్గొన్నవారిలో అన్ని వయస్సుల వారు ఉన్నారు. శ్రీమాతాజీవారు ఈ శిబిరంలో పాల్గొన్న సాధకులకు తమ దివ్యబోధామృతాన్ని అందించారు. అందులోని అంశాలను ఇక్కడ ప్రచురిస్తున్నాము.)

నిర్మల హృదయ విరాజిత చరణం
సకలచరాచర వ్యాపక చరణం
భవసాగర ఉద్ధారణ చరణం
శ్రీగురుచరణం ప్రణమామ్యహం

నువ్వు ఉన్నావు అంటే అది ఆయన అనుగ్రహమే. మనం ఆయనను పట్టుకునే ఉన్నాము. మనలో ఉన్న దోషదృష్టిపోతే మన హృదయం నిర్మల మవుతుంది. అక్కడ శ్రీగురుదేవులువిరాజమానమై ప్రకాశిస్తూ ఉంటారు.

చరణం అంటే రెండు అర్థాలు. పాటలోని పాదాన్ని చరణం అంటారు. చరణం అంటే పాదము అని కూడా అర్థం. ఆ చరణమే గురుచరణం. ఆ చరణం హృదయాన్ని నిర్మలం చేస్తుంది. గురుచరణం ఇంకా ఏమి చేస్తుంది?

**సకల చరాచర వ్యాపక చరణం -** ఈ చరణం ఇంతవరకే ఉందా? అది అంతటా వ్యాపకమై ఉన్నది. మనస్సు ఆ అనుభూతిని పొందుతోంది. కాని వేరే భావన వస్తే ఆ అనుభూతిని పొందలేకపోతోంది. ఇంకా ఆ చరణం

**భవసాగర ఉద్ధారణ చరణం -** ఆ చరణాన్ని ఆశ్రయిస్తే పోయేదేదో, ఉండేదేదో తెలిసిపోతుంది. గురుదేవులు మనలో సేవాభావాన్ని ఏర్పరచి, క్రమంగా తత్త్వపులోతులకు తీసుకెళ్తారు. ఏది వదిలి పెట్టాలో తెలియజేస్తారు. వదలకపోతే దిగజారిపోయేది నువ్వే. గురుదేవులు మనం ఎన్ని తప్పులు చేసినా సహించి, సన్మార్గంలో పెడతారు. మనకి ఏ కష్టం వచ్చినా ఆయన 'మెల్ట్' అయిపోతారు. 'కారాకులు డొల్లినట్లు కర్మలు డొల్లున్' మన కర్మబంధాలను తెంచుతారు. మనలను ఉద్ధరిస్తారు. అటువంటి నిర్మల హృదయంలో గురుచరణాలను భావన చేసుకోండి. ఎంతబావుంటుంది!

(తరువాయి భాగం 35వ పేజీలో చూడండి)

## మహాత్ముల వాక్కు

-పరాశర ప్రసాద్

ఆనాడు ఆశ్రమం అంతా కారు చీకటిగా ఉంది. కరెంటు పోయింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏదో లోపం ఉందిట. రాత్రి సమయంలో దాన్ని రిపేర్ చేయటం కుదరని పని. అయినా గురుదేవులు పరమ అనుగ్రహంతో సత్సంగ కార్యక్రమం యధావిధిగా జరిగింది.

శ్రీబాబూజీ మహరాజ్ మాట్లాడుతూ ...“**అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా। చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురువేనమః** అని శ్రీగురుగీత చెపుదోందికదా! అది యదార్థమేనా? సద్గురుమూర్తి అజ్ఞానాంధకారాన్ని తొలగించగల సమర్థుడే కదా!

అజ్ఞానాంధకారాన్ని మీరు తొలగించుకోలేరు కదా? ఈ చీకటిని కాండిల్స్‌తోగాని, కిరసనాయిలు దీపంతోగాని పారద్రోలగలుగుతారు. ఈ చీకటి గురించి బాధపడిపోతారుగాని అజ్ఞానమనే చీకటిని తొలగించుకుందామనే ఆవేదన ఎవరికీ కలుగదు. అయినా ఆశ్రమవాసులంతా కరెంటు లేక చీకటిలో బాధపడుతుంటే మాకు ఒక్కడికే ఈ బిల్డింగ్‌లో మాత్రమే వెలుగు ఉంది. అయ్యో పాపం! అలా జరిగిందేమిటయ్యా?” అని అన్నారు.

సద్గురుదేవుల ముఖస్థుగా ఆమాట వచ్చిన వెంటనే పెద్ద వెలుగు ఆశ్రమం వెలుపల కనిపించింది. ఏదో వాహనం రోడ్డు మీద నుంచి ఆశ్రమం వైపుగా వస్తున్నట్లుగా ఉంది. వెంటనే శ్రీబాబూజీ మహరాజ్ నారాయణరాజు, రామచంద్రరాజు గార్లని ఉద్దేశించి మాట్లడుతూ “మీరిద్దరూ క్రిందకు వెళ్ళి, ఆ వెలుగు ఏమిటో? ఆ వాహనం ఎందుకు వస్తోందో? ఆ వాహనంలో ఎవరు వచ్చారో? వాళ్ళు ఎందుకు వచ్చారో? అన్నీ వివరంగా కనుక్కురండి. మేము ఇక్కడనే ఉంటాము. మీరు వచ్చిన తరువాత సత్సంగం తిరిగి కొనసాగిద్దాం. మీరు వెళ్ళేటప్పుడు మీ వెంట ఒక కర్ర కూడా తీసుకెళ్ళండి. ఎందుకైనా మంచిది. ఆ వచ్చినవాళ్ళు దొంగలేమో! ఆశ్రమం అంతా చీకటిగా ఉందని, వాళ్ళకి దొంగతనానికి అనుకూలంగా ఉందని అనుకోవచ్చు. మీకు ఆత్మరక్షణకి తోడ్పడుతుంది దండం” అన్నారు.

వెళ్ళినవాళ్ళిద్దరూ అన్ని వివరాలూ కనుక్కొని తిరిగి వచ్చారు. ఆశ్రమంలో కరెంట్ పోయిందని డి.ఇ. గారికి ఫోన్‌చేశారట. అందువలన ట్రాన్స్ ఫార్మర్ రిపేర్ నిమిత్తం వచ్చారట. అర్ధ గంటలోపుగా కరెంట్ వస్తుందని

చెప్పారు. తీసుకెళ్ళిన కఱ్ఱ వాళ్ళ రిపేర్ పనికి ఉపయోగపడిందని చెప్పారు. శ్రీబాబూజీ మహరాజ్ మాట్లాడుతూ "చూశారా! భగవానుడు ఎంత దయామయుడో! భక్తులకు లోటు చేస్తాడా?'' అన్నారు.

---

(33వ పేజీ తరువాయి భాగం)

శ్రీగురుదేవులు తామెవరో తామే మనకు తెలియజేస్తూ తమ సందేశాన్ని ఒక కీర్తన రూపంలో మనకు అందించారు.

ఎవరు బాబు? అనేది ప్రశ్న. "ఎవరనుకుంటున్నావు?'' అని ఛలోక్తిగా ఆకాశం వైపు చూసి ఈ కీర్తనను ప్రసాదించారు.

**ఏ దేశమందుము ఏకాలమందుము**
**ఆకాశమునకేది దేశము కాలము**
**ఎవరికి తెలియగ తరమౌను బాబును**

అసలు నువ్వు ఎవరు? దేహము ఉన్నంత వరకేనా నీ ఎడ్రస్సు? నువ్వు దేహంతో పోతున్నావా? లేదు. నీ దేహం, నీ నామధేయం పోతాయి. నువ్వు ఉంటావు. ఉపాధి పోతుంది. కానీ పోయింది అనుకునేది అక్కడే ఉంది. అందుకనే నారాయణ సేవలో అందరికీ భోజనం పెడతారు. ఎందుకంటే భోజనంతో అందరూ తృప్తి పడతారు కనుక. నీ తాలుకు అనుకునే జీవుడికి కూడా తృప్తి కలుగుతుంది.

'అసలు నేను' తృప్తి చెందాలంటే ఈ ఇంటి విషయం (దేహం) తెలుసుకోవాలి. ఒకరోజు గడిస్తే మన ఆయుష్షు క్షీణించిపోతుంది. కాబట్టి మనం త్వరపడి ఈ జీవితం ఉండగానే గుర్తించాల్సిందేదో గుర్తించాలి.

ఎవరు బాబు? కేవలం ఆత్మకు సంబంధించిన వారు. ఆయన ఎవరని మనం వర్ణించగలం? ఎంతని తెలుసుకోగలం? మనం రాముణ్ణి ఆరాధిస్తున్నాము. గురువు, రాముడు వేరుకాదు. అలనాటి రాముడూ నా ప్రభువే. కృష్ణుడూ నా ప్రభువే. ఆయన ఏ కాలంలో లేరు? ఏ దేశంలో లేరు?

ఆకాశం అంటే అవకాశం. (స్పేస్) దీనికి రంగు లేదు. కాని మనకి కనిపించే ఆకాశానికి రంగు ఉంది. అంతటా ఉన్నదాన్ని మహాకాశం అంటారు. దేహంలో ఉన్నదానిని ఘటాకాశం అంటారు. ఒక ఇంజనీరు ప్లాన్ వేశాడు. ఖాళీ స్థలంలో భవన నిర్మాణం చేశాడు. అది భూకంపంలో పడిపోయింది. మళ్ళీ అక్కడ ఉన్నది ఖాళీ స్థలమే. -సశేషం

## మహాత్ములను సందర్శించిన గోమాత!

-జగం

సృష్టి, స్థితి, లయకారకుడు పరమాత్ముడు. సృష్టి అంతా భగవంతునిదే అయినప్పుడు సమస్త చరాచరజాలమందు ఆయన నిండియున్నాడు కదా! సాకారుడు, నిరాకారుడు అయిన పరమాత్ముడు లేనిచోటు, లేని సమయం లేవుకదా! భగవంతుడు ఎప్పుడు, ఎక్కడికి, ఎలా, ఏరూపంలో వస్తాడో తెలియదు.

ఒక కోతి కాలువలో అనేకమార్లు స్నానం చేసి, ప్రక్కనున్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రదక్షిణలు చేసి, స్వామిని దర్శించుకోవటం సుమారు 5సంవత్సరాల క్రితం తూర్పుగోదావరి జిల్లాలో జరిగింది.

ఎక్కడో గ్రామంలో ఒక పాము శివాలయంలో శివలింగానికి చుట్టుకునేదని విన్నాము. ఆ రూపాలలో వచ్చినది భగవంతుడు కావచ్చును, లేదా పూర్వజన్మలో ఎంతో పుణ్యం చేసుకున్న మహాత్ముడైనా కావచ్చు. తన ఆశ్రమంలో భోజనాలు జరుగుతున్న సమయాన కుక్కరూపంలో వచ్చినది రాముడు అని సంత్ కబీర్ గుర్తించటం, దాని వెనుక వారు 'రామా,రామా' అని పిలుస్తూ వెంటబడటం మనకు తెలిసినదే.

అటువంటిదే ఈ క్రింది సంఘటన..........

4-2-2011 నుండి 10-2-2011వరకు తూర్పుగోదావరి జిల్లా తుని పట్టణంలో "పంచాహ్నిక శ్రీసద్గురు చండీ రుద్రయాగం" కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. 5-2-2011 శనివారం నాడు తెల్లవారుజామున యాగసంకల్పం, విఘ్నేశ్వరపూజ, గోపూజ మొదలైన కార్యక్రమాలు జరిగాయి. సాధుధర్మసమ్మేళనం అదేరోజు ప్రారంభం. ఉదయం 10గం.లకు సత్సంగం ప్రారంభమైంది. భక్తులందరూ శ్రద్ధగా స్వామీజీల బోధలను ఆలకిస్తున్నారు.

ఇంతలో సుమారు 11గం.లకు సత్సంగ ప్రాంగణం ప్రధాన ద్వారం గుండా ఒక ఆవు లోనికి ప్రవేశించింది. రాజసంగా, ఠీవిగా, తాను కంగారు పడకుండా, భక్తులను కంగారు పెట్టకుండా లోనికివచ్చి, మగవారికి, ఆడవారికి మధ్యలోనున్న దారిగుండా క్రమశిక్షణ కలిగిన సైనికునిలా ధైర్యంగా నడుచుకుంటూ సత్సంగం వేదిక వద్దకు వచ్చింది. మహాత్ములను దర్శించింది. మహాత్ములూ ఆ గోవును దర్శించారు. అది మూత్రం, పేడవేసి పాడుచేస్తుందేమోనని ఒక భక్తుడు కంగారుగా ఆ గోవు వెనకాలే వచ్చి, నెమ్మదిగా బయటకు తోలుకుని వెళ్ళారు.

ఇంతకీ ఆ గోవు రూపంలో భక్తులను, మహాత్ములను దర్శింప వచ్చినదెవరు?

'నిజమగు భావన నీయగదే. హరి నీవే సర్వాత్మకుడవు'.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ భక్తులైన అడపా రామారావుగారు (కుమారస్వామిగారి తండ్రి) 8-4-2011 శుక్రవారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 83సంవత్సరాలు. వీరికి భార్య ఇద్దరు కుమారులు, అయిదుగురు కుమార్తెలు, మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాండ్రు కలరు. శ్రీసద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!




(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

రాధ సహకారం లభించి ఉండకపోతే ఇదంతా సంభవమై ఉండేది కాదు. రాధ లేకుండా కృష్ణుడు ఇదంతా చేయగలిగి ఉండేవాడా? అన్న ప్రశ్న ఉద్ధవుని మనస్సులో మెదిలింది... దీనితో పాటుగా ఎన్నాళ్ళుగానో మనస్సులో ఉన్న మరొక ప్రశ్నకు సమాధానం దొరికింది... ఆ అంత్యకాలంలో... పార్థివ దేహ త్యాగం చేయటం... చివరిగా కృష్ణుడు రాధను స్మరణ చేసికోవటం... ఎందుకు?... దానికి సమాధానం ఉద్ధవునికి ఇప్పుడు స్ఫురించింది! గోకులం నుంచి మధుర వెళ్ళాక కృష్ణుడు తిరిగి రాధను కలవలేదు. అంతేకాదు తిరిగి గోకులంలో అడుగు పెట్టలేదు... కృష్ణుని దేహత్యాగం గురించిన సమాచారం ఎప్పుడూ కృష్ణమయమై ఉన్న రాధకు అందజెయ్యాలి. ఆమె జీవనంలో కృష్ణుడు వ్రాసిన పుట తెరచే ఉంది. ఉద్ధవుడి వదనం మ్లానమైంది. అతని మనస్సు విషాదంతో నిండింది. కృష్ణుడు మధుర వెళ్ళాడు... కంసుని మరణం తరువాత జరాసంధుని తిరుగుబాటు నుంచి మధురను సంరక్షించటంలో నిమగ్నమై ఉన్నాడు. తరువాత ద్వారకకు వెళ్ళాడు... హస్తినాపురం... ఇంద్రప్రస్థం... ప్రాగ్జ్యోతిషపురం... అనవరతంగా ఈ ప్రదేశాలకు నిర్విరామంగా యాత్ర చేశాడు. కాని రాధ! గోకులం దాటి బయట అడుగు పెట్టనే లేదు. గోకులంలో వీచే గాలిలో, వృక్ష పర్ణాలలో, గోవు పొదుగులలో, యమునా నది కలకల నినాదాలలో, సతతం కృష్ణుడినే చూసింది... రాధ ఇప్పటికీ ప్రతీక్ష చేస్తునే ఉండి ఉంటుంది.... మధురా మార్గం నుంచి ఏదో ఒక రోజున ఒక రథం కృష్ణుణ్ణి తీసుకొని గోకులానికి వస్తుంది అని...

గోకులం నుంచి వెళ్ళటం... అది జ్ఞప్తికి రావటంతో ఉద్ధవుని మనః ఫలకములో కృష్ణుడు మధురను త్యాగం చెయ్యటం మెదలింది. కృష్ణుడు సమిష్టి కళ్యాణం కోసం గోకులాన్ని త్యాగం చేయటం ఒక మహత్వపూర్ణమైన ఘటన. కృష్ణుని మధుర త్యాగం సమిష్టి స్వార్థం నీచత్వంతో నిండిన అధ్యాయమైంది. మధురకు తిరిగి స్వాతంత్ర్యం తీసుకు వచ్చి కృష్ణుడు

గణతంత్రాన్ని పునరుద్ధరించాడు. శ్రేష్టులను, ప్రముఖ స్థానాలలో నియమించాడు. ఆ మధురా వాసులే.... ఆ యాదవులే కృష్ణునితో అన్నారు "కృష్ణా! మాకు ఇక నీ అవసరం లేదు. నువ్వు ఇక్కడ నుంచి వెళ్ళిపో!" ఆ సమయంలో ఉద్ధవుడు మధురలోని యాదవ సభలో ఉపస్థితుడై ఉన్నాడు. జనపదంలోని స్త్రీలలో నిర్భరత, ధర్మ సందేశాల ప్రచారం కోసం రాసలీలను నిమిత్తంగా చేసిన కృష్ణుణ్ణి చూశాడు ఉద్ధవుడు!... కంస సామ్రాట్‌ని నిముషమాత్రంలో పరాస్తంచేసి మధురలో గణతంత్రాన్ని పునర్జీవితం చేసిన కృష్ణుణ్ణీ ఉద్ధవుడు చూశాడు.....

మరి ఇప్పుడు ఆ మధుర వాసులే తనపట్ల నిరసన చూసిన ద్వారా కృష్ణుణ్ణి మధుర విడిచి వెళ్ళిన కృష్ణుణ్ణి కూడా ఉద్ధవుడు చూశాడు....

న్యాయం కోసం, ధర్మరక్షణ కోసం అవతరించి ధర్మస్థాపన చేసిన కృష్ణునికి తన జీవితంలో ఇంతటి అవహేళన ఎందుకు లభించింది? న్యాయబద్ధంగ ఉండి తన గురించి ఏమీ కోరకుండా నడిచిన కృష్ణునికి అన్యాయమనే హాలాహలం ఎందుకు త్రాగవలసి వచ్చింది?

ఉద్ధవుని చిత్తం హాహాకారం చేసింది.....

ఎప్పుడైతే కంసుని మరణ వృత్తాంతం మధురసీమను దాటి మగధ సామ్రాట్టు జరాసంధుని చెవిన పడిందో, అతను మండి పడ్డాడు. తన ఇద్దరు పుత్రికలను కంసునికి ఇచ్చి వివాహం చేశాడు. కనుక కంసుని ద్వారా ఆర్యావర్తంలోని గణతంత్రాలు విచ్ఛేదం కావాలని ఆశించాడు. ఉన్నట్లుండి తన కలలను కృష్ణుడు పటాపంచలు చేశాడు. అంతేకాదు మధురలో గణతంత్రం పునస్థాపితం చేసిన కృష్ణుడు మగధకు, ఆర్యావర్తంలోని ప్రజలకు స్వాతంత్ర్యం పొందే మార్గం చూపించబోతున్నాడు..... ఈనాడు కంసుని హత్య జరిగింది.... రేపు పౌండ్రుని లేక శిశుపాలుని పరిమార్చవచ్చు. కృష్ణుడు తనకి బద్ధ శత్రువుగా అవుతాడని గుర్తించాడు. కంసుని హత్య చేసిన కృష్ణుని చంపాల్సిందే అని నిర్ణయించుకొని జరాసంధుడు సేనను సమకూర్చుకొని, సంపూర్ణ బలంతో మధురపై ఆక్రమణ చేశాడు.

మధురలోని యాదవసభకు జరాసంధుని తిరుగుబాటు గురించి తెలియవచ్చింది.. తన పుత్రికల వైధవ్యాన్ని జరాసంధుడు ఎలా సహిస్తాడు? కంసుని మరణం తరువాత అచేతనంగ పడిఉన్న మధుర శక్తిని పుంజుకొని కృష్ణుని నేతృత్వంలో జరాసంధునితో తలపడటానికి మధుర సన్నిద్ధం

అవుతోంది.

మధుర ఈ విధంగా జరాసంధునితో యుద్ధానికి తలపడుతోందని అతడు ఎన్నడూ ఊహించలేదు. మధురను క్షణమాత్రంలో ఛిన్నాభిన్నం చేసి కృష్ణుని పరిమార్చాలని తను కన్న కలలన్నీ కల్లలైయాయి. కృష్ణుని నేతృత్వంలో యుద్ధానికి తలపడ్డ యాదవులు ఉగ్రసేనుని నేతృత్వంలో యుద్ధం చేసేవారి కన్నా ఘటికులు అన్న విషయం అర్థం చేసుకున్న వెంటనే తన శత్రువుపై ప్రతీకారాన్ని తీర్చుకోవటానికి కొత్త వ్యూహరచన చేశాడు....

సింధుదేశపు రాజైన కాలయవనుడు యాదవులకు విరోధి. కాలయవనుని తండ్రి మహర్షి గార్గుడు. ఆయనను యాదవుల పురోహితుడైన శాలుడు అవమానం చేశాడు. దానిపై కోపించిన గార్గుడు తన పుత్రుడైన కాలయవనునితో "ఎప్పుడైతే నీవు యాదవుల అహంకారాన్ని అణగదొక్కుతావో అప్పుడే పితృ ఋణం తీర్చుకొన్నవాడవౌతావు" అని అన్నాడు.

జరాసంధుడు కాలయవనుని సంప్రదించాడు. మధురకు ఉత్తరదిశ నుండి సింధుదేశపు సేన, దక్షిణ, పూర్వదిశల నుండి మగధసేన ముట్టడిస్తే అసహాయుడైన కృష్ణుని నాశం తథ్యం... అని భావించిన జరాసంధుడు కాలయవనునితో ఒప్పందం చేసికొన్నాడు.

సింధుదేశం నుండి కాలయవనుడు శ్యమంత పంచకమనే ప్రదేశాన్ని దాటి ఆర్యావర్త మైదానాల నుండి ఉరికివస్తున్నాడు అన్న కబురు మధురకు చేరగానే మధురలోని యాదవసేన అస్వస్థమైంది. స్వస్థంగా ఉన్నది ఒక్క కృష్ణుడే! శిశుపాల, పౌండ్ర, భీమాసురుల వంటి వీరులను ఢీకొనటానికి కృష్ణుడు ఎన్నడూ వెనుకాడలేదు.

ఎందుకంటే న్యాయం, ధర్మం మధుర పక్షాన ఉన్నాయి కాబట్టి. మంది మార్బలంలో కొంచెం తక్కువగా కనిపించినా ఓటమిరాదు అన్న గట్టి నమ్మకం కృష్ణునికి ఉంది. కాళీయుడు మొదలుకొని కంసుని వరకు అందరూ సమర్థులే. అయినా వారు పరాస్థులైనారు. ఎందుకంటే ధర్మం న్యాయం కృష్ణుని పక్షాన ఉన్నాయి కనుక.

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL